

# పల్లె వెలుగు

తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

RNI-APTEL/2012/46499

GST No.37ACDFM5465G1Z1

సంపుటి : 14 | సంచిక : 114 | తెలంగాణ ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : మహేష్ యాదవ్ | 23-04-2026 | పేజీలు :12 | వెల :03/-


## తిలక్ సెంచరీతో కుదేలైన గుజరాత్



## డీజిల్, పెట్రోల్ కొరత



బనగానపల్లె నియోజకవర్గంలో డీజిల్, పెట్రోల్ కొరత వేధిస్తోంది. కొలిమిగుండ్ల, అవుకు, బనగానపల్లె, సంజామల, కోవెలకుంట్ల మండలాల్లోని పెట్రోల్ బంకుల్లో నో స్టాక్ బోర్డులు వెలిశాయి. కొలిమిగుండ్ల, అవుకు, బనగానపల్లె ప్రాంతంలో నాపరాళ్ల రవాణా కోసం నిత్యం వేలాది వాహనాలు తిరుగుతుంటాయి. బనగానపల్లెలో బంకు వద్ద వాహనదారులు నిలిచిపోయిన సరుకు రవాణా ఫ పరిశ్రమల యజమానుల ఇబ్బందులు ఫ వాహనదారుల కష్టాలు.



## 25న దెందులూరుకు సీఎం చంద్రబాబు

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈనెల 25న దెందులూరు పర్యటనకు రాను న్నారు. ఈ నేపథ్యంలో హెలీ ప్యాడ్‌కు, సభ నిర్వహణకు అనువైన స్థలం ఎంపి క కోసం గోపన్న పాలెంలోని ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాలను, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణాన్ని, గోపన్నపాలెంకు సమీపంలోని పెదవేగి మం డలం లక్ష్మీపురం దెందులూరు మార్కెట్ యార్డు స్థలాన్ని కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఎస్పీ కె.ప్రతాప్ శివ కిశోర్‌లతో కలిసి దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ బుధవారం రాత్రి పరిశీలించారు. దెందులూరు రానున్న టీడీపీ కేడర్ ఉత్సాహంగా ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

## పగలు -సెగలు

జిల్లాలో భానుడు చెలరేగిపోతున్నాడు. రోజురోజుకూ ప్రతాపం చూపుతున్నాడు. ముడు రోజులుగా ఎల్‌నినో ప్రభావం కనిపిస్తోంది. మున్నెన్నడూ లేని విధంగా పలు మండలాల్లో 40 డిగ్రీలకు మించి అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అత్యధికంగా శ్రీరంగరాజపురంలో 41.5 డిగ్రీలు నమోదయింది.

## ఖర్గేకు ఈసీ నోటీసు



ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని ఉద్దేశించి 'టెర్రరిస్టు' అంటూ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మలి కార్జున్ ఖర్గే చేసిన వ్యాఖ్యలనుఎన్నికల కమిషన్ తీవ్రంగా పరిగణించింది. 24 గంటల లోగా వివరణ ఇవ్వాలని ఖర్గేకు నోటీసు పంపింది. ఖర్గే వ్యాఖ్యలు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించేలా ఉన్నందున ఆయనపై చర్య తీసుకోవాలని, బహిరంగంగా క్షమాపణ చెప్పాల్సిందిగా ఆదేశించాలని బీజేపీ ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం ఈసీకి బుధవారం ఉదయం ఫిర్యాదు చేసింది.

## చంద్రబాబు విఘ్నాలు లేకుండా ముందుకు సాగాలి -మంత్రి ఆనం



దేశంలోనే రాజకీయంగా సీఎం చంద్రబాబు గుర్తింపు పొందారని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. దేశ, విదేశాలలో చంద్రబాబు జన్మదినాన్ని ఘనంగా జరుపుకుంటున్నారని అన్నారు. నేటి యువత, మహిళలకు దిశానిర్దేశం చేస్తూ అనేక విద్య, ఉపాధి, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఉమ్మడిగా ఏపీ అభివృద్ధి, సంక్షేమం కోసం పాటు పడుతున్నారన్నారు. చంద్రబాబు నిరంతరం ప్రజల కోసం తపిస్తుంటారని మంత్రి తెలిపారు. ఆయనకు ఎలాంటి విఘ్నాలు లేకుండా ముందుకు సాగాలని, ఇంకా చాలాకాలం సీఎంగా ప్రజలకు తోడుగా ఉండాలని మహాయజ్ఞం నిర్వహించామన్నారు. కూటమి పార్టీల నేతలు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారని మంత్రి తెలిపారు. మహిళలకు డ్వాక్రా రుణాలు, కుట్టు మిషన్లు అందించామని. 200 మంది గర్భిణీ మహిళలకు శ్రీమంతాలు చేశామని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వం రైతుల భూములు లాక్కోవాలని చెల్లని పాసుపుస్తకాలు ఇచ్చిందని విమర్శించారు. ప్రస్తుతం రెవెన్యూ శాఖ ద్వారా పూర్తి హక్కులతో పాసుపుస్తకాలు, పొజిషన్ సర్టిఫికేట్లు పంపిణీ చేశామన్నారు. 106 మంది క్రీడాకారులకు క్రీడా కిట్లు పంపిణీ చేశామని తెలిపారు. అర్హత ఉన్న దివ్యాంగులకు లైసెన్సులు ఇప్పించామని అన్నారు. ఆలయాల్లో సనాతన ధర్మం, ఆచారాలను కాపాడుతూ కైంకర్యాలు నిర్వహిస్తున్నామని.. రూ.750కోట్ల నిధులతో ఆలయాల పునఃనిర్మాణాలు జరుగుతున్నాయని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు.

## ఇసుక -విశాఖకు



జిల్లా నుంచి విశాఖపట్నానికి ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. దొరికితే దొంగ లేదంటే దొర అన్న చందంగా ఇసుకాసురులు వ్యవహరిస్తున్నారు. నిత్యం వందల సంఖ్య లారీలతో ఇసుక లోడ్లు తరలిస్తున్నారు. అధికారుల తనిఖీ వేళ పట్టుబడితే జరిమానా విధిస్తున్నారు. కానీ తర్వాత పరిస్థితి షరామామూలే. ఇసుక రవాణాకు సంబంధించి జిల్లా సరిహద్దు ప్రాంతమైన పైడిభీమవరంలో చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. గతేడాది ఈ చెక్‌పోస్టులో తనిఖీలు చేపట్టగా సగానికిపైగా నకిలీ ధ్రువపత్రాలతోనే ఇసుకను తరలిస్తున్నట్టు అధికారులు గుర్తించారు. నిత్యం ఆ చెక్‌పోస్టులో రెవెన్యూ, పోలీస్ సిబ్బంది ఉండేవారు. షిఫ్టులవారీగా పనిచేసేవారు. కానీ ఇటీవల సిబ్బంది కొరత, ఇతరత్రా కారణాలతో గతం మాదిరిగా కట్టుదిట్టమైన తనిఖీలు లేవన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో జిల్లా మీదుగా ఇసుక అక్రమ రవాణా అడ్డూ అదుపూ లేకుండా తరలిపోతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆ రెండు నదుల్లో.. వందల లారీల్లో.. జిల్లాలోని వంశధార, నాగావళి నదులు ఇసుక అక్రమార్కులకు వరంగా మారాయి. నదులు, రీచ్‌ల్లో బరి తెగించి ఇసుక తవ్వకాలు చేపట్టి.. రవాణా సాగిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని ప్రవేశపెట్టింది. జిల్లాలో అధికారికంగా 18 రేవులకు అధికారులు అనుమతులిచ్చారు. వంశధారకు సంబంధించి కొత్తూరు మండలం నుంచి గార మండలం వరకూ పలు రేవులు ఉన్నాయి. నాగావళి నదికి సంబంధించి బూర్జ మండలం నుంచి శ్రీకాకుళం రూరల్, ఎచ్చెర్ల మండలం పరిధిలో పలు రేవులకు అనుమతిచ్చారు.

## బెంగాల్‌లో బాబ్రీ మసీదు కట్టనీయం -అమిత్‌షా



పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా మరోసారి ఘాటు విమర్శలు చేశారు. మమతా దీదీ ఎంత బలంగా కోరుకున్నా, ఎన్ని గట్టి ప్రయత్నాలు చేసినా బెంగాల్‌లో బాబ్రీ మసీదును బీజేపీ కట్టనీయదని స్పష్టం చేశారు. టీఎంసీ సిండికేట్ ముఠాలను బెంగాల్ నుంచి పారిపోయేలా చేస్తామన్నారు. బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల తొలివిడత పోలింగ్ ఈనెల 23న జరుగనుండగా, రెండో విడత ప్రచారంలో భాగంగా నార్త్ 24 పరగణాల జిల్లాలోని డుమ్ డుమ్ ఉత్తర్ ఏరియాలో బుధవారం నాడు జరిగిన ర్యాలీలో అమిత్‌షా పాల్గొన్నారు .

## బాబోయ్ టోల్ బాదుడు



జిల్లాలోని జాతీయ రహదారి 516-ఈ నిర్మాణ పనులు పూర్తి కాకుండానే హుకుంపేట మండలం పెదగరువు వద్ద టోల్ ఫీజును వసూలు చేస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాగా ఈ నెల నుంచి టోల్ ఫీజు 50 శాతం పెరగడంతో ఏజెన్సీ వాసులు మరింత ఇబ్బందులు పడుతున్నారు. గతంలో పాడేరు నుంచి అరకులోయ వైపు వెళితే నగదు రూపంలో రూ.50 తీసుకునే వారు. దానిని ఇప్పుడు రూ.75కు పెంచారు. ఎక్కడైనా రోడ్డు నిర్మాణం మొత్తం పూర్తయిన తర్వాత టోల్ ఫీజు వసూలు చేస్తారు. కానీ జిల్లాలో అందుకు భిన్నమైన పరిస్థితి నెలకొంది.

## గ్యాస్ కష్టాలకు చెక్



గ్యాస్ కష్టాలకు చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. యుద్ధం కారణంగా వంట గ్యాస్ కొరత ఏర్పడిన విషయం విదితమే. రెండు నెలలుగా సిలిండర్ల కోసం ప్రజలు అగచాట్లు పడుతున్నారు. హోటల్స్, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లు సగానికిపైగా మూతపడ్డాయి. రాష్ట్రంలోని ఐదు నగరాలలో కంప్రెస్డ్ గ్యాస్ ప్లాంట్లను ఏర్పాటుకు సిద్ధమైంది. అందులో ఒంగోలుకు అవకాశం ఇచ్చింది. ప్లాంట్ల నిర్వహణ బాధ్యతలను స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌కి అప్పగించగా పీపీపీ (ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం) విధానంలో ఏర్పాటు చేయనున్నారు.

## ఖర్గే వ్యాఖ్యలు ప్రజలను అవమానించడమే



కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే.. ప్రధాని మోదీని 'తీవ్ర వాది'గా సంబోధించడం దేశ ప్రజలను అవ మానించడమేనని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు అన్నారు. మూడోసారి ప్రధానిగా సేవలందిస్తున్న మోదీకి 25 ఏళ్ల పాలనా అనుభవం ఉందని ఆయన పేర్కొన్నారు. జకీర్ నాయిక్‌ను 'శాంతి దూత'గా పేర్కొనడమేంటీ అని ఆయన నిలదీశారు. మల్లికార్జున ఖర్గే.. ప్రధాని మోదీపై దిగజారుడు వ్యాఖ్యలు చేయడం దురదృష్ట కరమని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. మోదీని ఖర్గే ఉగ్రవాది అని సంబోధించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఖర్గే వ్యాఖ్యలు పూర్తిగా అవమానకరమని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. 'ప్రధానిని 'టెర్రరిస్ట్' అని సంబోధించడం అవమానకరం.

## పేదరికంలేని సమాజ స్థాపనే చంద్రబాబు ధ్యేయం



- పేదరికం లేని సమాజ స్థాపనే సీఎం చంద్రబాబు నాయుడు ధ్యేయమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ బాల వీరాంజనేయ స్వామి చెప్పారు. మంత్రి స్వామి మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం జోడించి రాష్ట్రాన్ని పురోగతి బాటలో పయనింపజేస్తున్న దార్శనికుడు చంద్రబాబు అని కొనియాడారు. తెలుగువారి ఆత్మగౌరవానికి నిలిస్తే తెలుగువారి ఆత్మవిశ్వాసాన్ని విశ్వవ్యాప్తం చేసిన మహోన్నత వ్యక్తి చంద్రబాబుని చెప్పారు. వైసీపీ ఐదేళ్ల పాలనతో గాడితప్పిన రాష్ట్రాన్ని తన పాలన అనుభవంతో పునఃనిర్మించడానికి అహర్నిశలు శ్రమిస్తున్నారని వివరించారు.

## పడిలేచిన రాజకీయ కెరటం



- దశాబ్దంన్నర రాజకీయ జీవితంలో అనేక కాల పరీక్షలను ఎదుర్కొని, ఒడుదుడుకులను తట్టుకుని, తనను తాను మలచుకుని అన్ని వర్గాల ప్రజల ఆదరాభిమానాల్ని చూరగొన్న యువనేత నారా లోకేశ్. దాదాపుగా అన్ని రాజకీయ పార్టీలు ఈ అంశంలో లోకేశ్ మార్గాన్ని అనుసరించాయి .

## వైఎస్ జగన్‌ను కలిసిన ప్యాపిలి మండల వైకాపా ఉపాధ్యక్షుడు కొండయ్య



**పల్లె వెలుగు -ప్యాపీలి**

ముఖ్యమంత్రి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని పులివెందులలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ప్యాపిలి మండల పార్టీ ఉపాధ్యక్షుడు కొండయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జగన్ మోహన్ రెడ్డికి కొండయ్య పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ భేటీలో ప్యాపిలి మండలంలోని పలు అభివృద్ధి పనుల పురోగతిని జగన్ అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా ఎదురవుతున్న సమస్యలు, ప్రజల అవసరాలు, పార్టీ బలోపేతం కోసం తీసుకోవాల్సిన చర్యలపై కొండయ్య ఆయనతో చర్చించారు. వైఎస్ఆర్సీపీ హయాంలో జరిగిన అభివృద్ధిని ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లాలని జగన్ ఈ సందర్భంగా దిశానిర్దేశం చేశారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు, నాయకుడికి అండగా ఉంటామని జగన్ మోహన్ రెడ్డి భరోసా ఇచ్చారు. ప్యాపిలి మండలంలో పార్టీ కార్యకలాపాలను ముమ్మరం చేయాలని, ప్రజల పక్షాన పోరాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొండయ్యతో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వడ్డు మధుకు ఎంపీ శబరి సన్మానం




**బండి ఆత్మకూరు పల్లె వెలుగు ఏప్రిల్ 22:**

బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న ఏ కోడూరు గ్రామానికి చెందిన వడ్డు మధుసూదన్ రెడ్డిని నంద్యాల పార్లమెంటు సభ్యురాలు బైరెడ్డి శబరి బుధవారం సన్మానించారు. గత నెల నాలుగవ తేదీన ఉభయ సంయుక్త రాష్ట్రాలు కలిసి జగ్గయ్యపేట మున్సిపాలిటీ ఈత పోటీలను నిర్వహించింది. ఏ కోడూరు గ్రామానికి చెందిన మధుసూదన్ రెడ్డి ఈతపై ఉత్సాహం కొద్ది తొలిసారిగా ఈ పోటీలలో పాల్గొన్నారు. మొత్తం నాలుగు రకాల స్విమ్మింగ్ ఈవెంట్లు పోటీలు జరిగాయి. ఈ నాలుగు రకాల ఈత పోటీలలో మధుసూదన్ రెడ్డి తృతీయ స్థానాలను సంపాదించారు. ఏపీ అండ్ టి జి, బిఎస్ఏ మాస్టర్ స్విమ్మింగ్ ఛాంపియన్షిప్ జగ్గయ్యపేట మున్సిపాలిటీ ఈవెంట్లను నిర్వహించగా తృతీయ స్థానం సంపాదించిన వడ్డు మధుసూదన్ రెడ్డి సర్టిఫికెట్లను మెడల్ ను అందుకున్నారు. ఈ సందర్భంగా నంద్యాల స్విమ్మింగ్ పూల్ అసోసియేషన్ ఒక కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీ శబరి సన్మానించి సత్కరించారు.

## కోడిగుడ్లు ఇవ్వడం లేదు సార్



హాస్టల్‌లో తమకు నాణ్యమైన భోజనం పెట్టడం లేదని, కోడిగుడ్లు అందరికీ ఇవ్వడం లేదని నగర శివారులోని పెద్దపాడులో ఉన్న దామోదరం సంజీవయ్య బాలసదన్ హాస్టల్ విద్యార్థినిలు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి దృష్టికి తీసుకువచ్చారు. (విద్యార్థులతో మాట్లాడుతున్న లీలా వెంకట శేషాద్రి. పెద్దపాడు బాలికల హాస్టల్ విద్యార్థినుల ఫిర్యాదుబుధవారం ఆయన అకస్మికంగా హాస్టల్‌ను తనిఖీ చేసినప్పుడు అక్కడ ఉంటున్న బాలికలు తమ ఇబ్బందులపై ఆయనకు ఫిర్యాదు చేశారు. ఆయన న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి అక్కడి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసి పిల్లలకు సరైన భోజనం అందజేసి ప్రతి ఒక్కరికి కోడిగుడ్లు పంపిణీ చేయాలని ఆదేశించారు. బాలసదన్‌లో తగినంత సిబ్బంది ఉన్నా హాస్టల్‌లో అపరిశుభ్రత ఉండటాన్ని గమనించి మండిపడ్డారు. కార్యాలయ రిజిస్టర్లను పరిశీలించి ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే పరిశుభ్రతను నెలకొల్పాలని, రికార్డులను సరైన పద్ధతుల్లో ఉంచుకోవాలని ఆయన సిబ్బందిని ఆదేశించారు.

## మహిళల భద్రత పై శాంతిరామ్ ఫార్మా కళాశాలలో ఏ ఎస్ పి ఎం. జావళి ఐపీఎస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు






**పల్లె వెలుగు నంద్యాల క్రైమ్.**

నంద్యాల జిల్లా వ్యాప్తంగా మహిళల భద్రత, మాదకద్రవ్యాల నియంత్రణ మరియు సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్న నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్ ఆదేశాలమేరకు నేడు నంద్యాల సబ్ డివిజన్ ఏ ఎస్ పి ఎం జావళి ఐపీఎస్ ఆధ్వర్యంలో శాంతిరామ్ ఫార్మసీ కళాశాలలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా నంద్యాల సబ్ డివిజన్ ఏ ఎస్ పి మేడం మాట్లాడుతూ సమాజంలో పెరుగుతున్న నేరాలను అరికట్టడానికి మరియు ప్రజలకు సురక్షితమైన వాతావరణాన్ని కల్పించడానికి పోలీస్ శాఖ కట్టుబడి ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో మహిళా భద్రత, డ్రగ్స్ మరియు సైబర్ నేరాలు మొదలగు వాటిపై ప్రజలకు అవగాహన కల్పించడం కొరకు సదరు కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ నేపథ్యంలో ప్రజలు కింది అంశాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. 1. మహిళా భద్రత & ఈవ్ టీజింగ్: మహిళల మరియు విద్యార్థినుల భద్రత మా ప్రథమ ప్రాధాన్యత. బహిరంగ ప్రదేశాల్లో వేధింపులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. మహిళా పోలీస్ స్టేషన్ వారి ఆధ్వర్యంలో శక్తి టీం బృందాలను ఏర్పాటు చేసి వేధింపులకు గురైనప్పుడు లేదా ఆపదలో ఉన్నప్పుడు వెంటనే 112 నంబర్ ద్వారా పోలీసు వారి సహాయం పొందవచ్చు. మీ పరిధిలోని పోలీస్ స్టేషన్‌లో భయం లేకుండా ఫిర్యాదు చేయవచ్చు. మీ వివరాలు గోప్యంగా ఉంచబడతాయి. మాదకద్రవ్యాల (డ్రగ్స్) నియంత్రణ: యువతను నిర్వీర్యం చేస్తున్న డ్రగ్స్ మహమ్మారిని అరికట్టడంలో ప్రజల సహకారం అవసరం. మీ పరిసరాల్లో ఎవరైనా డ్రగ్స్ విక్రయించినా లేదా వినియోగిస్తున్నా వెంటనే 1972 టోల్ ఫ్రీ నెంబర్ కు సమాచారం ఇవ్వండి. తల్లిదండ్రులు మీ పిల్లల ప్రవర్తనలో అకస్మాత్తుగా వచ్చే మార్పులను గమనించండి. ఏదైనా అనుమానం ఉంటే వెంటనే వారి స్నేహితులతో సమాచారం తీసుకుని సత్ప్రవర్తన కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలి. 3 . సైబర్ క్రైమ్ సాంకేతికత పెరుగుతున్న కొద్దీ సైబర్ నేరగాళ్లు కొత్త పద్ధతుల్లో మోసాలకు పాల్పడుతున్నారు. అపరిచితులకు మీ వ్యక్తిగత వివరాలు షేర్ చేయరాదు. మరియు బ్యాంకు అధికారులు ఎవరూ ఫోన్ చేసి మీ ఓటిపి, పిన్ లేదా వ్యక్తిగత వివరాలు అడగరని గుర్తించండి. తెలియని నంబర్ల నుండి వచ్చే సందేహాస్పద లింక్‌లను క్లిక్ చేయవద్దు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేయండి లేదా వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయండి. లేదా మీ దగ్గరలోని పోలీస్ స్టేషన్లో గాని జిల్లా సైబర్ క్రైమ్ ఇన్స్పెక్టర్ ని కానీ సంప్రదించి సహాయం పొందవచ్చు. నేర రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి. అనుమానిత వ్యక్తులు లేదా సంఘటనలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించి, బాధ్యతాయుత పౌరులుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఏ ఎస్ పి మేడం తో పాటు పాణ్యం సర్కిల్ ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ జయరాం, పాణ్యం సబ్ ఇన్స్పెక్టర్ నరేంద్ర కుమార్ రెడ్డి మరియు మహిళ వెల్ఫేర్ బృందాలు పాల్గొన్నారు.

## పోషణ పక్షోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలి





- పిల్లల భవిష్యత్తుకు ఉమ్మడి కుటుంబాలే బలమైన పునాది.
- మొదటి 1000 రోజులు అత్యంత కీలకం - తల్లిదండ్రులకు అవగాహన అవసరం.
- ఫోన్లు, టీవీల అతివాడకం పిల్లల అభివృద్ధిపై ప్రతికూల ప్రభావం.
- కథల ద్వారా పిల్లల్లో నైతిక విలువల పెంపకం అవసరం.
- జిల్లా కలెక్టర్ శ్రీమతి జి. రాజకుమారి గణియాలిథ

**పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.**

పోషణ పక్షోత్సవాలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, ప్రజల్లో ఆరోగ్యం మరియు పోషకాహారంపై విస్తృతమైన అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. బుధవారం నంద్యాల పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వెనుకనున్న నివర్తి భవన్‌లో నిర్వహించిన పోషణ పక్షోత్సవాల కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, సమాజంలో మారుతున్న కుటుంబ వ్యవస్థ, పిల్లల పెంపక విధానాలు మరియు ఆధునిక జీవనశైలితో ఏర్పడుతున్న సమస్యలపై పోషణ పక్షోత్సవాల ద్వారా అవగాహన కల్పిస్తున్నామన్నారు. గతంలో పెద్ద సంఖ్యలో ఉన్న ఉమ్మడి కుటుంబాలు ప్రస్తుతం తగ్గిపోవడం, వాటి స్థానంలో చిన్న కుటుంబాలు (న్యూక్లియర్ ఫ్యామిలీస్) పెరగడం వల్ల పిల్లల సంరక్షణలో లోటుపాట్లు ఏర్పడుతున్నాయని తెలిపారు. తల్లిదండ్రులు ఇద్దరూ ఉద్యోగస్తులు కావడం వల్ల పిల్లలను డే కేర్ కేంద్రాలు లేదా ఇతరుల వద్ద ఉంచాల్సిన పరిస్థితులు వస్తున్నాయని ఆమె పేర్కొన్నారు. పిల్లల అభివృద్ధిలో తొలి 1000 రోజులు అత్యంత కీలకమని స్పష్టం చేస్తూ, గర్భధారణ దశ నుంచి పుట్టిన తరువాత రెండున్నర సంవత్సరాల వరకు తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ దశలో తల్లి పాలివ్వడం, ప్రేమతో పెంచడం, పాటలు పాడడం వంటి చర్యలు పిల్లల మానసిక మరియు నరాల అభివృద్ధికి ఎంతో దోహదపడతాయని వివరించారు. అదేవిధంగా, చిన్నపిల్లలకు ఫోన్లు, టీవీలు అధికంగా ఇవ్వడం వల్ల కంటి సమస్యలు, మాట్లాడే లోపాలు, సామాజిక దూరం, హైపర్ యాక్టివిటీ వంటి సమస్యలు తలెత్తుతున్నాయని



హెచ్చరించారు. పిల్లలతో ప్రత్యక్షంగా గడపడం, వారితో సంభాషించడం అత్యంత అవసరమని తల్లిదండ్రులకు సూచించారు. పిల్లలలో మంచి విలువలు పెంపొందించేందుకు కథల ద్వారా బోధన ఎంతో ఉపయోగకరమని పేర్కొంటూ, "సిండ్రెల్లా" కథను ఉదాహరణగా వివరించారు. ఈ కథ ద్వారా దయ, సహనం, మంచితనం వంటి గుణాలను పిల్లలకు సులభంగా అర్థమయ్యేలా చేయవచ్చని చెప్పారు. ఈ సందర్భంగా పిల్లల పెంపకంలో తాతయ్యలు, అమ్మమ్మల పాత్ర అత్యంత ముఖ్యమని గుర్తుచేస్తూ, కుటుంబ సభ్యులందరూ కలిసి పిల్లల భవిష్యత్తు నిర్మాణంలో భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. అలాగే, తల్లిదండ్రులు సరైన ఆహారపు అలవాట్లు, ఆరోగ్యకరమైన జీవన విధానంపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఆరోగ్యవంతమైన, విలువలతో కూడిన భవిష్యత్ తరాన్ని తీర్చిదిద్దేందుకు కుటుంబ వ్యవస్థను బలోపేతం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

# ప్రభుత్వ కళాశాలలో సౌకర్యాలు





**బండి ఆత్మకూరు పల్లె వెలుగు ఏప్రిల్ 22 :**

ప్రైవేటు కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలలోను సకల సౌకర్యాలు ఉన్నాయని బండి ఆత్మకూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్లు పేర్కొన్నారు. పదవ తరగతి విద్యార్థులు ఉత్తీర్ణులైన సందర్భంలో వచ్చే విద్యా సంవత్సరంలో బండి ఆత్మకూరు ప్రభుత్వ కళాశాలలో చేరాలని గ్రామాలలో కళాశాల లెక్చరర్లు పర్యటించి విద్యార్థులను వారి తల్లిదండ్రులను అభ్యర్థిస్తున్నారు. బుధవారం కళాశాల లెక్చరర్లు డాక్టర్ జివి రఘునాథ్ రెడ్డి, డాక్టర్ ఎస్ కే నజీరుద్దీన్. మౌలాలి, కిరణ్, శివరామకృష్ణ చారి, జయమ్మ, ప్రసాద్, బాబా ఫక్రుద్దీన్ శ్యామల కుమారి రామ తులసి తదితరులు కాకనూరు గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాలలో నాణ్యమైన విద్యకు, సత్ప్రవర్తనకు,క్రమశిక్షణకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని అన్నారు. అన్ని పోటీ పరీక్షలకు సంబంధించి న పుస్తకాలతో కూడిన గ్రంథాలయ సౌకర్యం ఉందని చెప్పారు. పూర్తిస్థాయిలో పరికరాలతో కూడిన ప్రయోగశాల సౌకర్యం ఉందని తెలిపారు. వర్చువల్ ల్యాబ్ తో పాటు డిజిటల్ క్లాసులతో విద్యాబోధన జరుగుతుందని అన్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన సౌకర్యంతో పాటు, తల్లికి వందనం పథకం ద్వారా 15 వేల రూపాయల సౌకర్యం ప్రభుత్వ కళాశాలలో చదివే విద్యార్థులకు మాత్రమే వర్తిస్తుందని పేర్కొన్నారు. కళాశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన వారికి నగదు పురస్కారాలు అందజేయడంతో పాటు, మలబార్ జ్యువెలర్స్ ద్వారా స్కాలర్షిప్పులను అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. విద్యార్థినీ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ కళాశాలలో చేరి ఉన్నత విద్యను పొందాలని విద్యార్థులకు తల్లిదండ్రులకు సూచిస్తున్నామని కళాశాల లెక్చరర్లు పేర్కొన్నారు.

# ఏపీ మోడల్ స్కూల్ మధ్యాహ్న భోజన ఏజెన్సీని తక్షణమే తొలగించాలి

**పల్లెవెలుగు బేతంచెర్ల ప్రతినిధి (ఏప్రిల్ 22):-**

బేతంచెర్ల మండల పరిధిలోని గోర్మానకొండ వద్ద ఉన్న ఏపీ మోడల్ స్కూల్ లో మధ్యాహ్న భోజనం నిర్వహిస్తున్న వంట ఏజెన్సీ పై తక్షణమే శాఖపరమైన చర్యలు తీసుకొని తక్షణమే తొలగించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు యాన్న ఉదయ్ కుమార్ మండల కార్యదర్శి ప్రదీప్ లు స్థానిక మండల విద్యాధికారి కార్యాలయం ముందు నిరసన తెలిపి అనంతరం మండల విద్యాధికారి 2 అబ్రహం గారికి వినతి పత్రం సమర్పించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బేతంచెర్ల మండల పరిధిలోని గోర్మన్ కొండ వద్ద ఉన్న ఏపీ మోడల్ స్కూల్ లో మధ్యాహ్నం భోజన భోజనం నిర్వహిస్తున్న వంట ఏజెన్సీ పై తక్షణమే శాఖపరమైన చర్యలు తీసుకొని తక్షణమే తొలగించాలి విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టకుండా వారి కడుపు కొడుతూ తమకు ఎవరు ఏమి చెప్పకూడదు మేము పెట్టింది తినాలి అని ఇష్ట రాజ్యాంగ వ్యవహరిస్తున్నారని అనేకసార్లు విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం హెచ్చరించిన తీరు మార్చుకోకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేసి కడుపు మాడుస్తున్న వంట ఏజెన్సీ ని తక్షణమే తొలగించాలని కనీసం వచ్చే విద్యా సంవత్సరం నుండి అయిన విద్యార్థులకు తగిన పౌష్టిక ఆహారం అందించి విద్యార్థులకు న్యాయం చేయవలసినదిగా ఫిర్యాదు చేయడమైనది. ఈ



కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు ఖాదిర్, విష్ణు ,సుదర్శన్, మురళీకృష్ణ, సునీల్, అబ్దుల్లా, మురళి, మహేష్, చరణ్, మధు, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# వేసవి తాపం నుంచి రక్షణకు 'టోపీ' తోడు





**రాయలసీమ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ వినూత్న కార్యక్రమం**

**జర్నలిస్టులకు టోపీల పంపిణీ.. ముఖ్య అతిథులుగా సమాచార శాఖ డిడి జయమ్మ, సెట్కూరు సీఈఓ వేణుగోపాల్**

**పల్లె వెలుగు కర్నూలు బ్యూరో**

సమాజ హితం కోసం నిరంతరం క్షేత్రస్థాయిలో శ్రమిస్తూ వార్తా సేకరణలో నిమగ్నమయ్యే జర్నలిస్టులు.. ఎండల తీవ్రత దృష్ట్యా తమ ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు పాటించాలని పలువురు ప్రముఖులు పిలుపునిచ్చారు. 'వేసవిలో జాగ్రత్తలు పాటిద్దాం... ఆరోగ్యం కాపాడుకుందాం' అనే నినాదంతో రాయలసీమ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం కర్నూలు నగరంలోని సమాచార శాఖ భవన్ ప్రాంగణంలో జర్నలిస్టులకు టోపీల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షులు కె. శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి పలువురు అధికారులు, వైద్య నిపుణులు అతిథులుగా హాజరయ్యారు. వార్తా సేకరణలో ఆరోగ్యం ముఖ్యం ఈ సందర్భంగా సమాచార శాఖ డిడి కె. జయమ్మ, సెట్కూరు సీఈఓ డాక్టర్ కె. వేణుగోపాల్, ఏపీజెఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ కె. హరినాథ్ రెడ్డి మాట్లాడుతూ, సమాజంలో జరిగే విశేషాలను ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేస్తూ చైతన్యవంతం చేయడంలో జర్నలిస్టుల పాత్ర అగ్రగామి అని కొనియాడారు. విధి నిర్వహణలో భాగంగా ఎండల్లో తిరిగే జర్నలిస్టులు వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం ఆలోచించి, వారికి టోపీలను అందజేయడం శ్రీనివాసులు చేసిన అభినందనీయమైన కార్యమని ప్రశంసించారు. వైద్య నిపుణుల సూచనలు మెడికవర్ హాస్పిటల్ జనరల్ మెడిసిన్ నిపుణులు డాక్టర్ సరయు రెడ్డి, జి.ఎం. డాక్టర్ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. వేసవిలో శరీర ఉష్ణోగ్రత పెరగకుండా తల భాగం నేరుగా ఎండకు గురికాకుండా చూసుకోవాలని, ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. అనంతరం అతిథుల చేతుల మీదుగా జర్నలిస్టులకు టోపీలను అందజేశారు. పాల్గొన్న ప్రముఖులు: ఈ కార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్ ఏజీఎం ఎస్. ఖాదర్ బాషా, రాయలసీమ జర్నలిస్టు వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు భూపాల్, జిల్లా అధ్యక్షులు టి. రామకృష్ణ, విచక్షణ దినపత్రిక ఎడిటర్ రఘు, రాములు దినపత్రిక ఎడిటర్ చంద్రశేఖర్ తో పాటు పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొన్నారు.

## జమా ఆతె ఇస్లామీ హింద్ జకాత్ నుండి నూతన త్రీ వీలర్ కు లక్ష రూపాయలు వితరణ

**పేదవారిని తమ కాళ్ళపై నిలబెట్టడం లో జకాత్ ధ్యేయం సఫలీకృతం - సమద్.**



**పల్లె వెలుగు నంద్యాల రూరల్.**

జమాఇతె ఇస్లామీయ హింద్ ప్రతి రమజాన్ లో జకాత్ వసూలు చేసి పేదవారు చిన్న వ్యాపారాలు చేసుకొని తమ కాళ్ళపై నిలబడే విధంగా సహాయపడుతుంది. ఈ నేపథ్యంలో అద్దె ఆటోలతో సతమతమౌతున్న సాజిద్ ఖాన్ అనే వ్యక్తికి మున్సిపల్ ఆఫీసువద్ద గల మహేంద్ర షోరూమ్ లో చార్జబుల్ నూతన ఆటోకు లక్షరూపాయలు అడ్వాన్స్ చెల్లించి ఆటో తాళం చెవి నంద్యాల జమాఆతె ఇస్లామీ హింద్ శాఖ అధ్యక్షులు సాజిద్ కు అప్పజెప్పారు. ఈ సందర్భంగా సమద్ మాట్లాడుతు భవిష్యత్తులో మిగతా పైకం సాజిద్ ఖాన్ చెల్లించి ఆటో ఓనర్ కావడమే కాకుండా తాను ఇతరులకు సహాయపడే విధంగా ఎదగాలని, అదే జకాత్ ధ్యేయమన్నారు. ధనవంతుల ధనం పేదవారికి చేర్చే బాధ్యత పవిత్రమైంది, దైవభీతితో అది నెరవేర్చాలన్నారు. ఎగ్రా ఫిటింగులకు జనాబ్ షబ్బీర్ పదివేలు ఇచ్చారు.ఈ కార్యం సఫలీకృతం కావడానికి భాగస్వామ్యులైన ప్రతి ఒక్కరికి సమద్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఐహెచ్ కర్నూలు, నంద్యాల జిల్లా బాధ్యులు హాఫీజ్ షోయబ్ జమాన్, జనాబ్ షబ్బీర్ హుసేన్, ఖిద్మత్ సొసైటీ అధ్యక్షులు యూనూస్ పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వం దివ్యాంగులకు ఇచ్చిన అన్ని హామీలు నెరవేర్చాలి



**పాణ్యం, ఏప్రిల్ 22 పల్లె వెలుగు :**

నంద్యాల జిల్లా దివ్యాంగ జేఏసీ ఆధ్వర్యంలో దివ్యాంగుల సమస్యలు కోసం బుధవారం మండల కేంద్రంలో జేఏసీ అధ్యక్షుడు అందనం దేవరాజు,జిల్లా ప్రధాన కార్యదర్శి వనము రాజు , దివ్యాంగులహక్కుల విషయాలగురించి వారు మాట్లాడుతూ పాణ్యం లో దివ్యాంగుల సమావేశం ఏర్పాటు చేసి వారి సమస్యలు గురించి మాట్లాడుతూ ఎన్నో ఏళ్లు గా పరిష్కారం కాకుండా ఉండే సమస్యల పై దివ్యాంగులు అందరూ కలసి కట్టుగా సాధించుకోవడానికి సిద్ధంగా ఉండాలని ఆయన దివ్యాంగులకు తెలియజేశారు.ముఖ్యంగా 3 సెంట్ల ఇంటి స్థలం ఇచ్చి ప్రభుత్వం ఇల్లు నిర్మించి ఇవ్వడం వివాహ ప్రోత్సాహం 5 లక్షలకు పెంచాలి 35 కేజీ అంత్యోదయ రేషన్ కార్డు ఇవ్వడం అలాగే ప్రభుత్వం రేషన్ షాప్ ఇచ్చే క్రమంలో 5% రిజర్వేషన్లు అమలు చేసి దివ్యాంగులకు రేషన్ షాప్ లు కేటాయించాలని తెలియజేయడం జరిగింది.అనంతరం పాణ్యం మండలము లో దివ్యాంగుల నూతన కమిటీ నీ ఎన్నుకోవడం జరిగింది.మండల దివ్యంగా జేఏసీ అధ్యక్షుడు శివ కుమార్ ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసులు ఉపాధ్యక్షులు గా బాలక్రిష్ణ ప్రచార కార్యదర్శి గా రవి కుమార్ కోశాధికారి గా బలపనుర్ మధు, మహిళ విభాగం లో షేక్ రేష్మా ను ఎన్నుకోవడం జరిగింది.

## విత్తనోత్పత్తిలో మెలకువలు పాటించాలి

**మహానంది, పల్లె వెలుగు**



రైతులు సాగుచేసే వివిధ పంటల్లో విత్తనోత్పత్తికి సంబంధించి మెలకువలు పాటించాలని శాస్త్రవేత్తలు డాక్టర్ రవి ప్రకాశ్ రెడ్డి,డాక్టర్ మోహన్ విష్ణువర్ధన్, డాక్టర్ అరుణ్ కుమార్ తెలిపారు. బుధవారం మహానంది మండలం మసీదుపురం గ్రామంలో మండల వ్యవసాయ అధికారి నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో మహానంది ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, నంద్యాల అఖిలభారత విత్తన పరిశోధన, సమన్వయ పథకం క్రింద విత్తనోత్పత్తిపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. పంటల సాగులో విత్తనాల ఎంపిక కీలకమన్నారు. వరి, మినుములో మేలైన విత్తన రకాల విత్తనోత్పత్తి గురించి వివరిస్తూ. రకాల ఎంపిక, కేలీల ఏరవేత , జన్యు, బాహ్య స్వచ్ఛతల గురించి వివరించారు. వరి ఇతర పంటలలో ఎరువుల యాజమాన్యం గురించి తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ అధికారి భారతి, రైతులు పాల్గొన్నారు.

## రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులు -సమాలోచనలు లో పాల్గొన్న బేతంచెర్ల వైసీపీ నాయకులు





**బేతంచర్ల ఏప్రిల్ 22 (పల్లె వెలుగు ప్రతినిధి ):--**

వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రివర్యులు వై యస్ జగన్ మోహన్ రెడ్డి లి ఆదేశాల మేరకు రాయలసీమ ఎత్తిపోతల పథకం పై చంద్రబాబు నాయుడు మరియు రేవంత్ రెడ్డి ఇద్దరు కలిసి కుమ్మకై రాయలసీమ ఎత్తిపోతల పథకం ఆపి రాయలసీమకు చేస్తున్న అన్యాయానికి వ్యతిరేకంగా మరియు లిరాయలసీమ ఎత్తిపోతల పథకం సాధన కొరకు నంద్యాలలో జరిగినటువంటి లిరాయలసీమ సాగునీటి ప్రాజెక్టులు–సమాలోచన కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రివర్యులు బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి మాజీ మంత్రివర్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందం రెడ్డి, జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డి, నంద్యాల నియోజకవర్గ ఇన్చార్జిలు, ఎమ్మెల్సీలు, డోన్ ప్యాపిలి బేతంచెర్ల మండలాల, రాష్ట్ర, జిల్లా మండల,కమిటీ అధ్యక్షులు, మున్సిపల్ చైర్మన్లు, ఎంపీపీలు, కౌన్సిలర్లు, వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జనగణన ప్రతి ఒక్కరూ నమోదు చేసుకోవాలి

**స్వీయ నమోదు ప్రక్రియ ద్వారా ప్రతి ఒక్కరూ నమోదు చేసుకోవాలి.**

**ప్రతి ఒక్కరూ ఖచ్చితమైన సమాచారాన్ని నమోదు చేసుకోవాలి.**

**సబ్ కలెక్టర్ కార్యాలయం, ఆదోని.**

**ఆదోని (పల్లె వెలుగు):**



ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించబడుతున్న జనగణన2027 (సెన్సస్–2027) కార్యక్రమం భాగంగా, సబ్ కలెక్టర్ మరియు కార్యాలయ సిబ్బంది తమ స్వీయ నమోదు (సెల్ఫ్ ఏనుమరేషన్) ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు. ప్రభుత్వం చేపట్టిన ఈ డిజిటల్ జనగణన కార్యక్రమంలో భాగంగా, ప్రతి వ్యక్తి తమ కుటుంబ వివరాలను స్వయంగా నమోదు చేసుకునే విధానాన్ని ప్రోత్సహిస్తూ, ముందుగా కార్యాలయ స్థాయిలో ఈ ప్రక్రియను ఆదర్శంగా అమలు చేశారు.సబ్ కలెక్టర్ మాట్లాడుతూ, జనగణన 2027 దేశ అభివృద్ధికి అత్యంత కీలకమైనదని, ప్రజలందరూ స్వీయ నమోదు విధానాన్ని వినియోగించుకుని ఖచ్చితమైన సమాచారాన్ని అందించాలని కోరారు. ఈ సమాచారం ప్రభుత్వ పథకాల రూపకల్పన,వనరుల సమన్వయం,అభివృద్ధి కార్యక్రమాల అమలుకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.ఇదే సందర్భంగా, డివిజన్ పరిధిలోని అన్ని శాఖల ఉద్యోగులు ఈ వారంలోపే స్వీయ నమోదు ప్రక్రియను తప్పనిసరిగా పూర్తి చేయాలని సబ్ కలెక్టర్ ఆదేశించారు. అన్ని చార్జ్ అధికారులు మరియు అదనపు చార్జ్ అధికారులు ఈ ప్రక్రియ పర్యవేక్షణ బాధ్యతను తీసుకుని, తహసీల్దార్లు సమన్వయం చేస్తూ ఈ పనిని పూర్తిచేయాలని సూచించారు. అలాగే, కార్యాలయ సిబ్బంది అందరూ చురుకుగా పాల్గొని, నిర్ణీత సమయంలో తమ వివరాలను నమోదు చేసి, ఇతరులకు కూడా అవగాహన కల్పించేందుకు సిద్ధంగా ఉన్నారు.ప్రజలు కూడా సమీపంలో ఉన్న సౌకర్యాలను వినియోగించుకుని లేదా ఆన్‌లైన్ ద్వారా తమ వివరాలను నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేయడమైనది.

## నిరంతర పూజనీయుడు గురువు: ఎంఈవో



**మహానంది, పల్లె వెలుగు**

నిరంతర పూజనీయుడు గురువు అని మండల విద్యాశాఖ అధికారి రామసుబ్బయ్య పేర్కొన్నారు. బుధవారం మహానంది మండలం తిమ్మాపురంలోని ఎంపీపీ స్కూల్లో పనిచేసిన ప్రధానోపాధ్యాయుడు మద్దిలేటి పదవి విరమణ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఎంఈవో మాట్లాడుతూ.. ప్రధానోపాధ్యాయుడు మద్దిలేటి అందించిన సేవలు గుర్తుండి పోతాయన్నారు.వారి శేష జీవితం మంచి ఆరోగ్యంతో ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ లక్ష్మణరావు, ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నంద్యాలలో జన ఔషధీ మెడికల్ స్టోర్ ప్రారంభం










**పేదలకు తక్కువ ధరల్లో నాణ్యమైన మందుల అందుబాటు.**
**రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో సేవల విస్తరణకు నూతన అడుగు.**
**మంత్రి ఫరూక్, జిల్లా కలెక్టర్, ఎంపీ బైరెడ్డి శబరి చేతుల మీదుగా ప్రారంభం.**
**జిల్లా కలెక్టర్ రాజకుమారి కీలక పాత్ర.**
**కార్పొరేట్ సంస్థల సహకారంతో ఏర్పాటైన మెడికల్ స్టోర్.**

**పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.**

స్వచ్ఛమైన, నాణ్యమైన మందులు తక్కువ ధరలకు అందించడమే జన ఔషధీ లక్ష్యమని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. బుధవారం నంద్యాల ప్రభుత్వాసుపత్రి ఆవరణలో జేఎస్డబ్ల్యూ, రాంకో, రేన్ సిమెంట్ కంపెనీల సహకారంతో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రధానమంత్రి భారతీయ జన ఔషధీ మెడికల్ స్టోర్‌ను మంత్రి ఎన్ఎండి ఫరూక్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి నంద్యాల పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ బైరెడ్డి శబరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రెడ్ క్రాస్ జిల్లా ప్రెసిడెంట్ మరియు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ, పేద మరియు మధ్యతరగతి ప్రజలకు అత్యంత తక్కువ ధరల్లో నాణ్యమైన మందులు అందించాలనే లక్ష్యంతో ఈ జన ఔషధీ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ సూచనల మేరకు హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ సమావేశంలో తీర్మానం చేసి ఈ మెడికల్ షాప్‌ను రెడ్ క్రాస్ సంస్థకు కేటాయించినట్లు చెప్పారు. ప్రజలకు అవసరమైన అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచి, సేవలను విస్తృతం చేయాలని రెడ్ క్రాస్ ప్రతినిధులను సూచించారు. జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, నంద్యాల జిల్లాలో తక్కువ వ్యవధిలోనే బ్లడ్ స్టోరేజ్ సెంటర్ ఏర్పాటు చేయడంతో పాటు, "మీ ఇంటికి మీ డాక్టర్" వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. అదే విధంగా ఇప్పుడు పేద ప్రజలకు నాణ్యమైన మందులు తక్కువ ధరల్లో అందించేందుకు జన ఔషధీ మెడికల్ స్టోర్‌ను ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రజలు ఈ సదుపాయాన్ని విస్తృతంగా వినియోగించుకోవాలని ఆమె కోరారు. పార్లమెంట్ సభ్యులు డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ, ప్రధానమంత్రి ప్రవేశపెట్టిన జన ఔషధీ పథకం ద్వారా నాణ్యమైన మందులు తక్కువ ధరలకు అందుబాటులోకి రావడం ఎంతో ఆనందదాయకమని పేర్కొన్నారు. నంద్యాలలో ఈ కేంద్రం ఏర్పాటు కావడానికి మంత్రి, జిల్లా కలెక్టర్ మరియు రెడ్ క్రాస్ ప్రతినిధుల సమిష్టి కృషి కారణమని తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖ వ్యాపారవేత్త గోళ్ళ సుదర్శనం రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో చేపట్టనున్న సంక్షేమ కార్యక్రమాల కోసం రూ.1 లక్ష విరాళం అందజేశారు. జేఎస్డబ్ల్యూ సిమెంట్ కంపెనీ రూ.3,21,779 (మందులు మరియు పరికరాల కోసం), రాంకో సిమెంట్ రూ.3 లక్షలు (భవనం మరమ్మతులు, మౌలిక సదుపాయాల కోసం), రేన్ సిమెంట్ రూ.1 లక్ష, జిల్లా కలెక్టర్ కార్యాలయం రూ.1 లక్ష ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమం సందర్భంగా సహకరించిన సంస్థలు, ప్రతినిధులను ఘనంగా సత్కరించి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహకరించిన జేఎస్డబ్ల్యూ సిమెంట్ కంపెనీ ప్రతినిధి గంగాధర్ కురుప్, రాంకో సిమెంట్ కంపెనీ ప్రతినిధి శోభన్ బాబు, రేన్ సిమెంట్ ప్రతినిధి ఆనంద్ భాస్కర్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ దస్తగిరి పర్ల, సెక్రటరీ వజ్రాల శ్రీకాంత్ రెడ్డి, వైస్ చైర్మన్ డాక్టర్ మమతా రెడ్డి, ట్రెజరర్ నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు, అధికారులు, ప్రజాప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# రైతు బజార్‌పై జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ





**రైతులతో ముఖాముఖి. ధరలు, వసతులపై వివరాల సేకరణ. స్వయంగా కూరగాయల కొనుగోలు చేసిన కలెక్టర్. మార్కెట్‌లో అపరిశుభ్రతపై అసంతృప్తి.**

**పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.**

జిల్లాలో రైతులకు మెరుగైన మార్కెట్ సదుపాయాలు కల్పించడం, వినియోగదారులకు నాణ్యమైన కూరగాయలు అందుబాటులో ఉంచడం లక్ష్యంగా నిర్దేశించుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మార్కెటింగ్ ఏడి, ఎస్టేట్ అధికారులను ఆదేశించారు. బుధవారం టెక్కె మార్కెట్ యార్డ్‌లోని రైతు బజార్‌ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మార్కెట్‌లోని వివిధ దుకాణాలను పరిశీలించి, అక్కడి శుభ్రత, నిర్వహణ తీరును సమీక్షించారు. రైతులతో నేరుగా ముఖాముఖి మాట్లాడుతూ కూరగాయల ధరలు, అమ్మకాల పరిస్థితి, వారికి అందుతున్న వసతులు, ఎదురవుతున్న ఇబ్బందులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులు తెలిపిన సమస్యలను శ్రద్ధగా విని, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

అదేవిధంగా, వినియోగదారులతో కూడా మాట్లాడి ధరలపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ప్రజల అవసరాలు, రైతుల ప్రయోజనాలను సమన్వయం చేసే విధంగా రైతు బజార్ నిర్వహణ ఉండాలని కలెక్టర్ సూచించారు. తన పర్యటనలో భాగంగా కలెక్టర్ స్వయంగా కూరగాయలు కొనుగోలు చేసి, ధరలు మరియు నాణ్యతను పరిశీలించారు.
మార్కెట్ యార్డ్‌లో కొన్ని ప్రాంతాల్లో కనిపించిన అపరిశుభ్రత, షాపుల నిర్వహణలో లోపాలపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేస్తూ వారం రోజుల్లోగా మార్కెట్‌లోని అన్ని సమస్యలను పరిష్కరించి, పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రైతు బజార్‌లో పారిశుధ్యం, తాగునీటి సదుపాయం, చెత్త నిర్వహణ, సరైన ధరల ప్రదర్శన వంటి అంశాల్లో ఎటువంటి నిర్లక్ష్యం ఉండరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. రైతులు మరియు వినియోగదారుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. జిల్లాలో రైతు బజార్‌లను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తామని, ప్రజలు కూడా శుభ్రత పాటించడంలో సహకరించాలని కలెక్టర్ కోరారు.

# పోలీసు శాఖ ప్రతిష్టను పెంచేలా విధులు నిర్వహించండి







**హోంగార్డ్స్ సంక్షేమానికి అధిక ప్రాధాన్యత..**

**కమాండెంట్ ఎం. మహేష్ కుమార్ .**

**పల్లె వెలుగు నంద్యాల క్రైమ్.**

సదరన్ రీజియన్ కమాండెంట్ యం. మహేష్ కుమార్ మరియు డి.ఎస్.పి, హోంగార్డ్స్, కర్నూల్ కె వి వి ఎస్ వి ప్రసాద్ విసిటింగ్ ప్రోగ్రాం నిమిత్తం నంద్యాల జిల్లా హోంగార్డ్స్ యూనిట్ కు రావడం జరిగింది. కమాండంట్ హోంగార్డ్స్ జ్ఞుఖుతీఖుఎవ ను పరిశీంచడం జరిగింది. తరువాత దర్బార్ లో హోంగార్డ్స్ గురించి మాట్లాడుతూ హోంగార్డ్స్ ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూనే మెరుగైన సేవలు అందించాలి. పోలీసు వ్యవస్థలో హోంగార్డుల సేవలు అత్యంత కీలకమని, విధి నిర్వహణలో క్రమశిక్షణ పాటిస్తూ శాఖ ప్రతిష్టను పెంచేలా పని చేయాలని సదరన్ రీజియన్ హోంగార్డ్స్ కమాండెంట్ ఎం. మహేష్ కుమార్ అన్నారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన హోంగార్డు కమాండెంట్ హోంగార్డుల నుండి గౌరవ వందనాన్ని స్వీకరించారు. సిబ్బంది పనితీరును తనిఖీ చేశారు. మీరు ఆరోగ్యంగా ఉన్నప్పుడే సమాజానికి సమర్ధవంతంగా సేవ చేయగలరన్నారు. అలాగే రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలని, ప్రయాణాల్లో జాగ్రత్తలు వహిస్తూ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, వాహన ఇన్సూరెన్స్ వ్యక్తి గత ఇన్స్యూరెన్స్ లు కలిగి ఉండాలని సూచించారు. అనంతరం నిర్వహించిన 'దర్బార్'లో హోంగార్డులు తమ సమస్యలను కమాండెంట్ దృష్టికి తీసుకెళ్లారు. వీటిపై ఆయన సానుకూలంగా స్పందిస్తూ.. సమస్యలను జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అలాగే హోంగార్డ్స్ కు సంబదించిన వెల్ఫేర్ స్కీం గురించి తెలియచేయడశీ జరిగింది. ఈ కార్యక్రమం లో హోంగార్డు డిఎస్పీ ప్రసాద్, హోంగార్డ్స్ ఇంచార్జ్ ఆర్ ఐ, విజయ్ నరసింహులు ఆర్ ఎస్సై ఉమామహేశ్వర రెడ్డి హోంగార్డ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

# నంద్యాల లో స్విమ్మింగ్ పూల్ నిర్మిస్తాం





**స్విమ్మింగ్ విజేతల అభినందన సభలో ఎంపీ బైరెడ్డి శబరి.**

**పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.**

నంద్యాల మున్సిపాలిటీ పరిధిలో ఒక అత్యాధునిక స్విమ్మింగ్ పూల్ మంజూరు చేయిస్తామని తద్వారా జిల్లా నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయి స్విమ్మర్లను తయారు చేస్తామని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి తెలిపారు. జగ్గయ్యపేటలో జరిగిన రెండు తెలుగు రాష్ట్రాల స్విమ్మింగ్ ఛాంపియన్షిప్ లో విశేష ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన కాశీపురం ప్రభాకర్ రెడ్డి, వి మధుసూదన్ రెడ్డిల అభినందన సభకు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. నంద్యాల రామకృష్ణా పి జి కళాశాలలో డా. జి రామకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన సభకు ఎంపీ శబరి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్బంగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ నేను చిన్నప్పటి నుంచి స్విమ్మర్ నే. జాతీయ స్థాయి పోటీల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు ప్రాతినిధ్యం వహించాను, స్విమ్మింగ్ చేయడం వల్లనే నేను ఆరోగ్యంగా ఉన్నాను. మీ పిల్లలకు ఈత నేర్పించడం మీరిచ్చే గొప్ప బహుమతి. స్విమ్మింగ్ లో రాణిస్తే స్పోర్ట్స్ కోటా కింద ఉద్యోగాలు సాధించ వచ్చు. ఆరు పదుల వయసులో ప్రభాకర్ రెడ్డి ఇంత ప్రతిభ చూపడం అద్భుతం..స్విమ్మింగ్ విజేతలను సన్మానించడం నాకు దక్కిన గౌరవం అన్నారు. నంద్యాల మున్సిపాలిటీ పరిధిలో ఒక ప్రొఫెషనల్ స్విమ్మింగ్ పూల్ మంజూరు చేయిస్తాం.. నంద్యాల నుంచి స్విమ్మింగ్ లో జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేద్దాం. మా నాయకుడు చంద్రబాబు నాయుడు క్రీడలకు అపారమైన ప్రోత్సాహం ఇస్తున్నారు. రామకృష్ణ విద్యా సంస్థల అధినేత డా రామకృష్ణా రెడ్డి మాట్లాడుతూ స్విమ్మింగ్ మీద మక్కువతో తన ఇంట్లోనే ఒక స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు చేశామన్నారు. రోజూ స్విమ్మింగ్ చేస్తే మీ ఆరోగ్యం మీ గుప్పిట్లో ఉన్నట్లే అన్నారు. కాశీపురం ప్రభాకర్ రెడ్డి ఒక ప్రతిభా వంతమైన రచయిత గా తెలుసు అనీ, అయితే ఈత లో ఇంత గొప్ప ప్రవీణుడని తెలియదన్నారు. ఈ కార్యక్రమంలో మారంరెడ్డి జనార్దన్ రెడ్డి, రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్ కాటంరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ నరహరి విశ్వనాథ రెడ్డి, డా రాకేష్ రెడ్డి తదితరులు ప్రసంగించారు.

# కూటమి ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి





**మూడు కోట్ల వ్యయంతో హనవాళ్లు పెద్దహరివానం బీటీ రోడ్డు పనులు.**

**అభివృద్ధికి కృషిచేసిన మీనాక్షి నాయుడుకు కృతజ్ఞతలు తెలిపిన హనువాళ్లు గ్రామ ప్రజలు.**

**ఆదోని (పల్లె వెలుగు) :**

ఈరోజు హనవల్ గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు ఆదోని టిడిపి ఇన్చార్జ్, మాజీ శాసనసభ్యులు మీనాక్షి నాయుడు నివాసంలో ఘనంగా సన్మానించారు.హనవల్ గ్రామం నుండి పెద్ద హరివానం వరకు సుమారు మూడు కోట్ల రూపాయల వ్యయంతో బీటీ రోడ్డును శాంక్షన్ చేయించడంతో గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న మీనాక్షి నాయుడు శాలువా కప్పి, పూలమాలలతో సత్కరించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మాట్లాడుతూ, గ్రామ సమస్యల పరిష్కారం కోసం ఎల్లప్పుడూ ముందుండే నాయకుడు



మీనాక్షి నాయుడు అని కొనియాడారు. గ్రామ అభివృద్ధికి మరిన్ని సేవలు అందించాలని కోరారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులుపంపిణీ చేసిన ఎమ్మెల్యే చరిత రెడ్డి



**పల్లె వెలుగు దినపత్రిక గడివేముల .**

నంద్యాల జిల్లా పాణ్యం నియోజకవర్గం గడివేముల మండలం తిరుపాడు గ్రామానికి చెందిన పగిడిపాల శ్రీనివాలు కి రూ.26,218/-ల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును పంపిణీ చేసిన పాణ్యం నియోజకవర్గం ఎమ్మెల్యే, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి గౌరు చరిత రెడ్డి . ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్టీఆర్ ఇష్ట వైద్య సేవలు ప్రజలకు ఎంతో మేలు కరంగా ఉంటుందని దీనివలన కొంతమంది ప్రాణాలను కాపాడుకోవడానికి ప్రవేశపెట్టిన మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ పథకం ద్వారా పేద ప్రజలు మధ్యతరగతి వారు వారి దగ్గర ఆరోగ్యం నృత్య చూపించుకోవడానికి తగినంత సొమ్ము లేకపోయినప్పటికీ ప్రభుత్వం అందిస్తున్న ఈ పండు ద్వారా వారికి కొంత మేరకు లాభదాయకంగా ఉంటుందని ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బీసీసెల్ గడివేముల మండల అధ్యక్షులు సి గిరిబాబు పాల్గొన్నారు.పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ కొండగా అండగా ఉంటుందని,కష్టాల్లో ఉన్న ప్రతిఒక్కరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు

# ఇంటర్ సప్లిమెంటరీ ఫీజుల దోపిడి ని తక్షణమే అరికట్టాలి

**ఎస్ఎఫ్ఐ ఆళ్లగడ్డ మండల్ కార్యదర్శి లతీఫ్**

**ఆళ్లగడ్డ ప్రతినిధి ఏప్రిల్ 22 పల్లెవెలుగు**



ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల పేరుతో కార్పొరేట్, ప్రైవేట్ జూనియర్ కళాశాలలు విద్యార్థుల ను బహిరంగంగా దోచుకుంటు న్నాయని ఎస్ఎఫ్ఐ ఆళ్లగడ్డ మండల్ కార్యదర్శి లతీఫ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన నమోదు ఫీజు 600, ప్రతి సబ్జెక్టుకు ?160 మాత్రమే ఉండగా, వాటిని పక్కన పెట్టి అధిక మొత్తాలు వసూలు చేయడం పూర్తిగా అక్రమమని స్పష్టం చేశారు. ఈ అక్రమాలను అరికట్టడంలో నంద్యాల జిల్లా ఆర్ ఐ ఓ పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. ఇప్పటి వరకు ఫీజుల విషయంలో ఆర్ఐఓ ఎటువంటి పత్రికా ప్రకటన కూడా ఇవ్వకపోవడం బాధాకరమని అన్నారు. కార్పొరేట్, ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాలకు తలగ్గి వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అదనంగా, వసూలు చేసిన ఫీజులకు సంబంధించి విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఎటువంటి రసీదులు కూడా ఇవ్వడం లేదని పేర్కొన్నారు. ఇది పూర్తిగా అక్రమమని, వెంటనే ప్రత్యేక తనిఖీలు చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, అదనంగా వసూలు చేసిన మొత్తాన్ని విద్యార్థులకు తిరిగి చెల్లింప జేయాలని డిమాండ్ చేశారు. ధన్యవాదములు తో భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ ) ఆళ్లగడ్డ మండల్ కమిటీ.

## మహానాడుకు చాపురం వద్ద స్థల పరిశీలన

**పాత శ్రీకాకుళం, ఏప్రిల్ 22 పల్లెవెలుగు**

శ్రీకాకుళంలో నియోజక వర్గంలో మహానాడు నిర్వహణకు గాను అనువైన ప్రదేశాల ఎంపికపై ప్రజాప్రతినిధులు దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో బుధవారం శ్రీకా కుళం నగరంలో విలీన పంచాయతీ చాపురం సమీపంలో హైవేకి ఆను కుని ఉన్న స్థలాలను ఎమ్మెల్యే గొండు శంకర్ తహసీల్దార్ గణపతిరావుతో కలిసి పరిశీలించారు. మహానాడు ఏర్పాట్లపై తహసీల్దార్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్ ( శంకర్) శ్రీకాకుళంలో నియోజక వర్గంలో మహానాడు నిర్వహణకు గాను అనువైన ప్రదేశాల ఎంపికపై ప్రజాప్రతినిధులు దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో బుధవారం శ్రీకా కుళం నగరంలో విలీన పంచాయతీ చాపురం సమీపంలో హైవేకి ఆను కుని ఉన్న స్థలాలను ఎమ్మెల్యే గొండు శంకర్ తహసీల్దార్ గణపతిరావుతో కలిసి పరిశీలించారు. మహానాడుకు అవసరమైన ప్రాంగణం, వాహనాల పార్కింగ్, రాకపోకలకు మార్గాలు, తాగునీరు, విద్యుత్ తదితర సదుపా యాల కల్పనపై చర్చించారు. అలాగే అత్యవసర సేవలపై చర్చించారు. మహానాడు నిర్వహణకు అనువైన ప్రదేశాన్ని త్వరలో ఖరారు చేయను న్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పంచిరెడ్డి అప్పల నాయుడు, అల్లు సరసయ్య, మట్ట అనందరావు, మట్ట రమేష్, మట్ట పాపారావు, అల్లు దాళప్పదు, జల్లెపల్లి రామారావు పాల్గొన్నారు.

# సర్వీస్ రోడ్డులోనే ఆర్టీసీ బస్సులు నడపండి మహాప్రభో

- ఎన్ హెచ్ రోడ్డు ఎక్కాలంటే భయం భయం
- సర్వీస్ రోడ్డు లోనే బస్సులు నడపాలని గ్రామస్తుల విజ్ఞప్తి



పల్లె వెలుగు బేతంచెర్ల ప్రతినిధి ( ఏప్రిల్ 22 )

బేతంచెర్ల మండలం ఆర్ ఎస్ రంగాపురం గ్రామం చీఎ 340 బి లో సర్వీస్ రోడ్డు లోనే బస్సులు నడపాలని గ్రామస్థులు బుధవారం విలేకరులకు తెలిపారు. వారు మాట్లాడుతూ... నేషనల్ హైవే రోడ్డు ను ప్రారంభించిన నాటి నుండి బస్సులు మెయిన్ రోడ్డు లోనే వెళ్తున్నాయి అని తద్వారా మేము చాలా ఇబ్బందులకు గురవుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా వాహనాలు మెయిన్ రోడ్ లో వెళ్తున్నాయని, ఆ వాహనాలు ఎక్కడానికి వెళు ్ుండగా మాకు నిత్యము ప్రమాదాలు జరుగుతున్నాయని వారు వాపోయారు. గత ఆరు నెలల్లో ప్రమాదాలు జరిగి ముగ్గురు అక్కడికక్కడ మృతి చెందారని వారన్నారు. కాబట్టి ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సర్వీస్ రోడ్డులోనే బస్సులు వెళ్లే లాగునా చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. డోన్ ఆర్టీసీ మేనేజర్ ను పత్రిక విలేఖరి వివరణ కోరగా: అందుకు స్పందించిన డోన్ ఆర్టీసీ మేనేజర్ బేతంచెర్ల మండలం ఆర్ఎస్ రంగాపురం గ్రామం లోని ఎన్ హెచ్ 340 రోడ్డు ను పరిశీలించి, మూడు రోజులలోపు సర్వీస్ రోడ్డు లోనే ఆర్టీసీ బస్సులు నడిపేలా, సత్వర చర్యలు తీసుకుంటామని ఆయన తెలియజేశారు.ం

# ఉయ్యాలవాడలో వైభవంగా శ్రీ వెంకటేశ్వర స్వామి తిరుణాల

- స్వామివారి ప్రభ ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి
- ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్న ఎమ్మెల్యే





పల్లె వెలుగు కర్నూలు బ్యూరో

మండల పరిధిలోని ఉయ్యాలవాడ గ్రామంలో వెలసిన శ్రీ శ్రీ వెంకటేశ్వర స్వామి తిరుణాల మహోత్సవాలు బుధవారం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన స్వామి వారి ప్రభ ఊరేగింపు కార్యక్రమంలో పాణ్యం నియోజకవర్గ శాసనసభ్యురాలు శ్రీమతి గౌరు చరిత రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆమె స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రంగురంగుల విద్యుత్ దీపాలు, పూలతో అలంకరించిన ప్రభ ఊరేగింపును ఆమె వీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి మాట్లాడుతూ: "పురాతన సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతిబింబంగా నిలిచే ఇలాంటి తిరుణాల ఉత్సవాలు గ్రామంలో ఐకమత్యాన్ని పెంచుతాయి. శ్రీ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నాను." ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఆలయ ధర్మకర్తలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఉయ్యాలవాడ గ్రామం గోవింద నామస్మరణతో మారుమోగింది.

# సీఎం సహాయ నిధి పేదలకు పెన్నిధి: ఎమ్మెల్యే బుడ్డా







మహానంది, పల్లె వెలుగు

సీఎం సహాయ నిధి పేదలకు పెన్నిదని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి అన్నారు. బుధవారం వెలుగోడు మండలం వేల్పనూరులో మహానంది మండలం మసీదుపురం గ్రామానికి చెందిన సంఘు చిన్న సుబ్బరాయుడు రూ. 62,000 ఆవుల వెంకట లక్ష్మమ్మ రూ.30,000 పెరుమాళ్ళ చెన్నుడు రూ.35,000 అలాగే గాజులపల్లె గ్రామానికి చెందిన కాకునూరు లక్ష్మీదేవి రూ. 51,000 కే.దివాకర్ రూ. 25,000 కే.ఆంజనేయులు 26,000 సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందుకున్నారు.వైద్యం పరంగా ఆపదలో ఉన్నవారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా వైద్య సహాయం కోసం నిధులు తమకు అందేలా కృషి చేసిన తెలుగుదేశం పార్టీ మండల క్లస్టర్ ఇన్చార్జి నరాల చంద్రమౌళీశ్వర రెడ్డి, గోపవరం సొసైటీ చైర్మన్ గంగవరపు ఉమామహేశ్వర్ రెడ్డి, శ్రీశైలం మాజీ దేవస్థానం ధర్మకర్త రవి స్వామి లకు, ఎమ్మెల్యేకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.

# శ్రీ కాళికాంబ చంద్రశేఖర స్వామి దేవస్థాన నూతన పాలక మండలి అభినందన సభ







ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి ఎన్ఎండి ఫరూక్.

పల్లె వెలుగు నంద్యాల రూరల్.

నంద్యాల స్థానిక గాంధీ చౌక్ దగ్గరలో ఉన్న శ్రీ కాళికాంబ చంద్రశేఖర స్వామి దేవస్థాన నూతన పాలక మండలి సభ్యుల అభినందన సభ బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పాల్గొన్నారు .ఈ సందర్భంగా ఆలయ నూతన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన బింగుమళ్ల సుబ్బలక్ష్మయ్య ని మరియు పాలక మండలి సభ్యులైన వసుంధర దేవి, లక్ష్మణ్ సింగ్, వరలక్ష్మి శారదాబాయి, భారతి విజయభాస్కర్, సుబ్రహ్మణ్యం,రాజ్ పురోహిత్ బాబు సింగ్, సుబ్రహ్మణ్య శాస్త్రి (ఎక్స్ అఫీషియో సభ్యులు) లను మంత్రి ఫరూక్ ఘనంగా సన్మానించారు . చైర్మన్ సుబ్బలక్ష్మయ్య మాట్లాడుతూ భక్తులందరికీ స్వామివారి దర్శనం సులభతరం చేసేలా, ఆలయ ప్రతిష్టను మరింత పెంచేలా, భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా తమ పాలక మండలి కృషి చేస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ దేవాలయాలు మన సంస్కృతికి, ఆధ్యాత్మికతకు నిలయాలని, భక్తుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా నూతన పాలక మండలి పనిచేయాలని సూచించారు. ఆలయ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన బింగుమళ్ల సుబ్బలక్ష్మయ్య గారికి మరియు సభ్యులకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన వసతులు కల్పించాలని కోరారు. చారిత్రక నేపథ్యం ఉన్న శ్రీ కాళికాంబ చంద్రశేఖర స్వామి ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. పాలక మండలి సభ్యులందరూ సమన్వయంతో పనిచేసి ఆలయ ప్రతిష్టను మరింత పెంచాలని పిలుపునిచ్చారు. ఈ అభినందన సభలో గౌరవ అతిథులుగా ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు ఇల్లూరి లక్ష్మయ్య , కూడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, బిజెపి జిల్లా అధ్యక్షులు అభిరుచి మధు, టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్, టిడిపి మాజీ రాష్ట్ర కార్యదర్శులు రామచంద్రరావు, జిల్లెల్ల శ్రీరాములు, శ్రీశైలం ట్రస్ట్ బోర్డ్ మెంబర్ మురళీధర్, మాజీ కౌన్సిలర్ కండే శ్యామ్ సుందర్ లాల్, ఆర్యవైశ్య సంఘం నంద్యాల జిల్లా అధ్యక్షులు బింగ్ మల్లె శ్యామ్ సుందర్ గుప్తా, ప్రథమనంది దేవస్థానం చైర్మన్ చలం బాబు, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు బోయ రామకృష్ణ తదితర నాయకులు, ఆలయ అర్చకులు మరియు భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి

బండి ఆత్మకూరు పల్లె వెలుగు ఏప్రిల్ 22:

తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని బండి ఆత్మకూరు మండల విద్యాశాఖ అధికారులు ఆర్ యశోద, మోహన్ రెడ్డి లు పేర్కొన్నారు. బుధవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ బండి ఆత్మకూరు మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రవేట్ పాఠశాలలకు ఏప్రిల్ 24 నుండి జూన్ 11వ తేదీ వరకు ప్రభుత్వ అధికారిక విద్యా క్యాలెండర్ను అనుసరించి వేసవి సెలవులను ప్రకటించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు తల్లిదండ్రులకు విద్యాశాఖ అధికారులు పలు సూచనలు చేశారు. వేసవి కావడం వల్ల ఎండలు తీవ్రంగా ఉంటాయి కాబట్టి ఉదయం 11 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు పిల్లలు బయటికి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. చిన్నపిల్లలను ఒంటరిగా బయటకు పంపకుండా తల్లిదండ్రులు ప్రత్యేకంగా శ్రద్ధ వహించాలన్నారు. పెద్దల పర్యవేక్షణ లేకుండా పిల్లలు బావులు చెరువులు కాలువలు వంటి నీటి వనరుల వద్దకు ఈత కొట్టడానికి వెళ్లి ప్రమాదాలు కొని తెచ్చుకోకుండా కట్టుదిట్టమైన పర్యవేక్షణ ఉండాలని పేర్కొన్నారు. పిల్లలకు తరచూ తగినంత నీరు మజ్జిగ పన్న రసాలు ఇస్తూ డిహైడ్రేషన్ నివారించుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు.



విద్యార్థులు సెలవుల సమయంలో ఇంటి వద్దే సురక్షితంగా ఉండి పుస్తకాలు చదవడం, చేతిరాత మెరుగుపరచుకోవడం, సృజనాత్మక కార్యక్రమాల్లో పాల్గొనడం వంటి అలవాట్లను పెంపొందించుకోవాలని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై నిరంతరం పర్యవేక్షణ వహించి వారి ఆరోగ్యం భద్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని మండల విద్యాధికారులు విజ్ఞప్తి చేశారు.

## పునర్విక శ్రీమాన్ పుట్టినరోజు సందర్భంగా వందలాది మందికి మజ్జిగ పంపిణీ

**డోన్ మండలం, వెంకటనాయుని పల్లె (పల్లె వెలుగు):**



డోన్ మండలం, వెంకటనాయుని పల్లె గ్రామానికి చెందిన స్ఫూర్తి శ్రేయోభిలాషులు శ్రీ బండపల్లి హనుమాన్, శ్రీమతి బండపల్లి శివ గౌతమి గార్ల ముద్దుల కుమార్తె చిన్నారి బండపల్లి పునర్విక శ్రీమాన్ ద్వితీయ పుట్టినరోజు శుభ సందర్భంగా స్ఫూర్తి సేవా సమితి ఆధ్వర్యంలో డోన్ పాత బస్టాండ్ సర్కిల్ నందు ఎండలకు ఇబ్బంది పడుతున్న వందలాది మంది బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. చిన్నారి పునర్విక శ్రీమాన్ పుట్టినరోజు సందర్భంగా మజ్జిగ పంపిణీ చేయించిన పునర్విక శ్రీమాన్ అవ్వ తాతలు కటారుకొండ గ్రామానికి చెందిన శ్రీమతి ఆలా విజయలక్ష్మి, శ్రీ ఆలా లక్ష్మికాంత రెడ్డి (విశ్రాంత పోస్టల్ ఉద్యోగి – పోస్టల్ ఎంప్లాయిస్ సంఘం రాష్ట్ర నాయకులు) గార్లకు స్ఫూర్తి సభ్యులు ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో దాతలు పోస్టల్ లక్ష్మికాంత రెడ్డి గారు, దాత కుటుంబ సభ్యులు ఆలా కళ్యాణ్, మర్రి హరి, బ్యాంకు హనుమంత రెడ్డి, పోస్టల్ వెంకటేశ్వర్లు, స్ఫూర్తి సభ్యులు స్ఫూర్తి మధు, మోహన్ రెడ్డి, అంజి యాదవ్, వసంత్, సిమ్ హరి తదితరులు పాల్గొన్నారు. స్ఫూర్తి సేవా సమితి. డోన్ 7989474725.

## మొబైల్ ఫోన్ల పంపిణీ





**కోసిగి, ఏప్రిల్ -22 (పల్లెవెలుగు):**

నియోజకవర్గంలోని బుక్ కీపర్లకు డిజిటల్ సేవలను మరింత సమర్థవంతంగా అందించాలనే లక్ష్యంతో మంత్రాలయం తెలుగుదేశం పార్టీ ఇంచార్జి ఎన్.రాఘవేంద్ర రెడ్డి 140 మొబైల్ ఫోన్లను ఘనంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయిలో సేవల అందజేతలో బుక్ కీపర్ల పాత్ర ఎంతో కీలకమని, ఆధునిక సాంకేతికతను అందుబాటులోకి తీసుకువచ్చి వారి పనితీరును మరింత వేగవంతం చేయడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందేలా ప్రతి విభాగంలో డిజిటల్ వినియోగాన్ని ప్రోత్సహించడంలో తాము ముందుంటామని పేర్కొన్నారు. ఈ చర్యతో గ్రామ స్థాయిలో పరిపాలన మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా మారుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, బుక్ కీపర్లు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ప్రధాని మోడీ పై కాంగ్రెస్ వ్యాఖ్యలను ఖండించిన బద్వేల్ మార్కెట్ యార్డ్ చైర్ పర్సన్ సుప్రజ



**బద్వేల్, ఏప్రిల్ 22 (పల్లె వెలుగు)**

ప్రపంచ ప్రజల అభిమానాలను చూరగొన్న ప్రధాని మోడీపై కాంగ్రెస్ నాయకులు చేసే వ్యాఖ్యలు సంస్కారహీనంగా ఉన్నాయని సుప్రజ విలేకరుల సమావేశంలో తెలియజేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రధానిని ఇష్టమొచ్చిన రీతిలో దూషించడం కాంగ్రెస్ నాయకుల మనస్తత్వాన్ని తెలియజేస్తుందని అన్నారు. పెద్ద నోట్ల రద్దు, 370 ఆర్టికల్ రద్దు, పౌరసత్వ సవరణ చట్టం, త్రిపుల్ తలాక్ రద్దు, అయోధ్య రామాలయ సమస్య పరిష్కారం ఒంటి దేశ సమస్యల పరిష్కారానికి ఆయన ఒక దిక్సూచి అని అటువంటి రాజనీతిజ్ఞున్ని మల్లికార్జున ఖర్గేను ముందు పెట్టి కాంగ్రెస్ నాయకుల దుర్మార్గపు ఆలోచనలను ఆయన నోటి గుండా చెప్పించడం క్షమించరాని విషయమని, దేశ ప్రజలు దీనిని గమనిస్తున్నారని ఈ సందర్భంగా ఆమె అన్నారు. ప్రధానిపై విమర్శలు చేసే సందర్భంలో హుందాతనాన్ని ప్రదర్శించాలని ఆమె సలహా ఇచ్చారు.

# ప్రకృతి వ్యవసాయంపై క్షేత్రస్థాయిలో సిబ్బందికి శిక్షణ కార్యక్రమం








**మండల వ్యవసాయ అధికారి సుధాకర్.**

**ఆదోని (పల్లె వెలుగు):**

ఈరోజు ఆదోని మండలం, ధనాపురం గ్రామంలో రామయ్య పొలంలో మండల వ్యవసాయ అధికారి సుధాకర్ ఆధ్వర్యంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్, విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్ మరియు ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి రెండవ రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ రెండవ రోజు శిక్షణలో భాగంగా ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ (పీఎండిఎస్) అమలు విధానాన్ని క్షేత్ర స్థాయిలో దశల వారీగా ప్రదర్శించడం జరిగింది. వర్షాకాలానికి ముందుగా విత్తనాలను విత్తడం ద్వారా నేలలో తేమను సమర్థంగా వినియోగించుకునే విధానాన్ని వివరించడం జరిగింది.అలాగే జీవామృతం మరియు ఘన జీవామృతం తయారీపై ప్రాక్టికల్ డెమోన్స్ట్రేషన్ నిర్వహించడం జరిగింది. జీవామృతం తయారీలో ఉపయోగించే పదార్థాలు, వాటి మోతాదులు, కలపడం విధానం, పంటలకు ఉపయోగించే పద్ధతులపై సవివరంగా తెలియజేయడం జరిగింది అదేవిధంగా ఘన జీవామృతం తయారీ విధానం మరియు దాని వినియోగంపై కూడా వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏ.ఈ.ఓ.లు, ఎం.పీ.ఈ. ఓ.లు,గ్రామ వ్యవసాయ సహాయకులు మరియు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నగేష్,లక్ష్మీదేవి,మహాలక్ష్మి, మరియు ఐ సి ఆర్ పి లు పాల్గొనడం జరిగింది.

# చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి







**ఎఫ్ ఏ పి టి ఓ సంఘం నాయకులు ఆదోని**

**ఆదోని (పల్లె వెలుగు) :**

గత 2 సంవత్సరాలనుండి పెండింగ్ లో ఉన్న ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించిన ఫలితం లేని పక్షంలో ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ ఉద్యమానికి పిలుపు ఇచ్చిన సందర్భంగా ఈరోజు ఆదోని ఎఫ్ ఏ పి టి ఓ నాయకులు నాగరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమం లో జిల్లా ఎఫ్ ఏ పి టి ఓ సెక్రటరీ జనరల్ భాస్కర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎంతో ఆశతో ఈ ప్రభుత్వం ను ఎన్నుకుంటే 2 సంవత్సరాలైన ఈ ప్రభుత్వం లో ఉపాధ్యాయుల సమస్యలపై కనీస చలనం లేదన్నారు గత సంవత్సరం ఎఫ్ ఏ పి టి ఓ ఆధ్వర్యంలో ధర్నా చేస్తే 1 డి ఎ ని ఇచ్చి చేతులు దులుపుకొని ఇక ఉద్యోగ, ఉపాధ్యాయులు సమస్యలు పట్టనట్లు వ్యవహరిస్తున్న సందర్భం లో ఇక గత్యంతరం లేని పరిస్థితులలో ఎఫ్ ఏ పి టి ఓ రాష్ట్ర సంఘం ఈ ఉద్యమానికి పిలుపునిచ్చారు 30 శాత ఐ ఆర్ ఇవ్వాలని, పి ఆర్ సి కమిషన్ ను నియమించాలని, పెండింగ్ 4 డి ఎ లు చెల్లించాలని, ఈ రాష్ట్రము లో మెమో 57 ను అమలుజరపాలని, సిపిఎస్ ను రద్దు చేయాలి, తెలుగు మీడియం ఉండాలని, కారుణ్య నియామకాలు విద్యా శాఖలో చేపట్టాలని, ఇలా 17 డిమాండ్ లతో ఉన్న ఎఫ్ ఏ పి టి ఓ కరపత్రాలు ఆదోని ఎఫ్ ఏ పి టి ఓ సభ్య సంఘాల నాయకులు కలసి ఛలో విజయవాడ కరపత్రాలు విడుదల చేశారు కాబట్టి మండలం, జిల్లాలో ఉన్న ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొని 26వ తేదిన జరుగు దీక్షను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో మహాదేవప్ప, సుంకన్న, శ్రీనివాసులు,రమేష్ ముత్తన్న, సుధాకర్, వీరచంద్ర, రామకృష్ణ, లక్ష్మన్న, సూర్యుడు, గంగానాయక్ తదితరులు పాల్గొన్నారు.

# తుంగభద్ర నది పై బ్రిడ్జిని నిర్మించాలి





**కోసిగి, ఏప్రిల్ - 22 (పల్లెవెలుగు):**

మండల పరిధి కుంభనూరు గ్రామం దగ్గర తుంగభద్ర నదిపై రెండు రాష్ట్రాలు కలిపే బ్రిడ్జిని నిర్మించాలని సిపిఎం పార్టీగా తెలుగుదేశం పార్టీ మంత్రాలయం నియోజకవర్గం ఇన్చార్జి రాఘవేంద్ర రెడ్డి కి మెమొరండం అందించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు కే. మల్లయ్య మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రం వాళ్ళు ఉరుకుంద ఈరన్న దేవస్థానమునకు రావాలన్నా, కౌతాళం ఖాదర్ లింగయ్య దర్గాకు రావాలన్నా 50,60 కిలోమీటర్లు దూరం వెళ్లి రావలసినటువంటి పరిస్థితి ఉంది. కుంభలూరు దగ్గర బ్రిడ్జి నిర్మిస్తే మన రాష్ట్ర ప్రజలకు గాని, కర్ణాటక రాష్ట్ర ప్రజలకు రాకపోకలు చాలా అనుకూలంగా ఉంటుంది. వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి అని ఆయన అన్నారు. అందుకు రెండు రాష్ట్రాల జల వనరుల శాఖ మంత్రులు, అధికారులు, రాజకీయ నాయకులు కలిసి సంయుక్తంగా మాట్లాడుకుని బ్రిడ్జి నిర్మాణం కొరకు కృషి చేయాలని రాఘవేంద్ర రెడ్డి కి సిపిఎం పార్టీగా తెలియజేయడమైనది. అందుకు ఆయన సానుకూలంగా స్పందిస్తూ నేను బ్రిడ్జి నిర్మాణం కొరకు కృషి చేస్తాను అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు కే మల్లయ్య ,మండల కార్యదర్శి బి ఈరన్న ,నాయకులు నారాయణ ,నాగరాజు, నరసన్న, మారయ్య తదితరులు పాల్గొన్నారు..

# దివ్యాంగుల సమస్యల పైన ఎంపీ బైరెడ్డి శబరి కి వినతి పత్రం ఇచ్చిన డిజేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏపీ





**పల్లె వెలుగు నంద్యాల రూరల్.**

దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిజేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏపీ ఆధ్వర్యంలో స్థానిక బొమ్మల సత్రంలో ఉన్న ఎంపీ కార్యాలయంలో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కి వినతిపత్రం అందించడం జరిగినది. ఈ సందర్భంగా డిజేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏపీ వ్యవస్థాపక అధ్యక్షులు డిపి మస్తాన్ వలి మాట్లాడుతూ... దివ్యాంగులకు గత సంవత్సరంలో జూన్ 26 తేదీన టౌన్ హాల్లో అలింకో సంస్థ వారు దివ్యాంగులకు కావలసిన సహాయ పరికరాల ఎంపిక శిబిరం నిర్వహించడం జరిగిందని తెలిపారు. గత సంవత్సరం అక్టోబర్ నెలలో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం పురస్కరించుకొని వృద్ధులకు వీల్ చైర్స్, చేతి కర్రలు, వాకర్స్,బెల్టులు ఇవ్వడం జరిగిందని తెలిపారు . దివ్యాంగులకు ఇంతవరకు కూడా బ్యాటరీ ట్రై సైకిల్స్ ఇవ్వలేదని దివ్యాంగులు చాలా ఇబ్బందులు పడుతున్నారని తొందరగా బ్యాటరీ ట్రై సైకిల్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. అలాగే ఆన్లైన్లో అప్లై చేసుకున్న దివ్యాంగులకు ప్రభుత్వం ఇస్తున్న మూడు చక్రాల స్కూటర్లు త్వరగా ఇప్పించాలని, తదితర దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని ఆయన కోరారు. స్పందించిన ఎం పి డాక్టర్ బైరెడ్డి శబరి దివ్యాంగుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిజేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏపీ ఉపాధ్యక్షులు కిరణ్ కుమార్ సభ్యులు నబి రసూల్, పాణ్యం మండల వికలాంగుల అధ్యక్షులు రవీంద్ర నాయక్, రవికుమార్, అబ్దుల్లా, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

# రీసర్వే పనులు వేగవంతం చేయాలి: కలెక్టర్ రాజకుమారి ఆదేశాలు





**మార్చి 2027 నాటికి పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ పూర్తి లక్ష్యం. ఫేజ్1 నుంచి ఫేజ్5 వరకు పనుల్లో ఆలస్యం. గ్రౌండ్ ట్రూతెనింగ్ ఖచ్చితత్వంపై కలెక్టర్ దృష్టి. భూ సమస్యల పరిష్కారానికి సమగ్ర కార్యాచరణ.**

**పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.**

జిల్లాలో కొనసాగుతున్న భూ రీసర్వే పనులను నిర్ణీత గడువులోపు సమర్థవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సర్వే శాఖ అధికారులను ఆదేశించారు. రీసర్వేకు సంబంధించిన ఫేజ్1 నుండి ఫేజ్5 వరకు ఉన్న అన్ని దశలను వేగవంతం చేసి, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని ఆమె ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఎన్ఐసి వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఆర్డీఓలు, తహశీల్దార్లు, విఆర్ఓలు, విలేజ్ సర్వేయర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సర్వే ఎడి శ్రీరామ్ మోహన్‌తో పాటు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం సమగ్ర కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తున్నదని తెలిపారు. భూసంబంధిత వివాదాలు, అడ్డంకులు తక్షణమే పరిష్కరించే విధంగా అన్ని స్థాయిలలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రౌండ్ ట్రూతెనింగ్ ప్రక్రియను అత్యంత ఖచ్చితత్వంతో నిర్వహించాలని, ఫీల్డ్ స్థాయిలో వాస్తవ పరిస్థితులను సరిగ్గా నమోదు చేయడం ద్వారా రైతులకు న్యాయం జరిగేలా చూడాలని ఆమె పేర్కొన్నారు. పనుల ప్రగతిపై అధికారులను అడిగి తెలుసుకుని, ఎక్కడైనా ఆలస్యం ఉంటే వెంటనే సరిదిద్దే చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మార్చి 2027 నాటికి జిల్లాలోని ప్రతి రైతుకు పట్టాదారు పాసు పుస్తకాలు అందజేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం కట్టుబడి ఉందని కలెక్టర్ తెలిపారు. ఈ లక్ష్య సాధనకు అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసి, నిర్దేశిత కాలపట్టికలో పనులు పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు. అనంతరం ఆత్మకూరు డివిజన్‌లోని వెలుగోడు మండలం, డోన్ డివిజన్‌లోని ప్యాపిలి మండలం, బనగానపల్లె డివిజన్‌లోని సంజామల మండలం, నంద్యాల డివిజన్‌లోని ఆళ్లగడ్డ మండలాల్లో రీసర్వే పనుల పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. ప్రతి మండలంలో పనుల స్థితిగతులను విశ్లేషించి, అవసరమైన సూచనలు జారీ చేశారు. రీసర్వే ప్రక్రియలో నాణ్యత, పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా అధికారులు పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.

# అట్టహాసంగా బడి పిలుస్తోంది కార్యక్రమం

**గడివేముల పల్లె వెలుగు దినపత్రిక**





గడివేముల మండలంలోని పెసరవాయి గ్రామంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు, గ్రామంలో మేళతాళాలతో బడి పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి సుబ్బరామిరెడ్డి, గ్రామ పెద్దలు శిరుప భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బడి ఈడు పిల్లలందరినీ, గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చేర్చాలని, ప్రభుత్వ పాఠశాలలో అర్హత గల ఉపాధ్యాయులు, విశాలమైన తరగతి గదులు, స్మార్ట్ టీవీ ద్వారా బోధన, విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్, షూ, వంటి వసతులు ఉంటాయని దీనివల్ల తల్లిదండ్రులకు ఆర్థిక భారం తగ్గుతుందని మరియు విద్యార్థులకు విలువైన విద్య అందుతుందని. కాబట్టి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్చాలని గ్రామంలో మేళతాళాలతో బడి పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి విద్యార్థులు ఉత్తమమైన ఫలితాలను సాధిస్తున్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యాబోధనలో ఎక్కడ రాజి పడకుండా ప్రభుత్వ ఉపాధ్యాయులు విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో బోధిస్తున్నారు కావున మీ పిల్లలను ప్రభుత్వపరుల్లో చేర్పించి నాణ్యమైన విద్యను నేర్చుకొనుటకు, ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలను అర్థమయ్యే రీతిలో తల్లిదండ్రులకు వివరించడం జరిగింది. పిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న యూనిఫామ్ ఇష్టంగా అందిస్తుంది డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం పిల్లలకు ఎంతో ఆరోగ్యకరమైన మంచి భోజనం అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలలో మీ పిల్లల చేర్పించాలని గ్రామంలో గ్రామ ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జ్యోతి, ఉపాధ్యాయులు రాజేష్ యాదవ్, పాపారావు, బాలాజీ సింగ్ మండల విద్యాశాఖ అధికారి సుబ్బారామి రెడ్డి మరియు గ్రామ పెద్దలు శిరుప భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ భార్గవ రామ దంపతులకు మర్యాదపూర్వకంగా కలిసిన ఏపీపీ





**ఆళ్లగడ్డ ప్రతినిధి ఏప్రిల్ 22 పల్లె వెలుగు**

ఆళ్లగడ్డ కోర్టుకు నూతన ఏ పి పి గా నియమితులైన న్యాయవాది ఉప్పలపాటి ప్రతాప్ బుధవారం నాడు పట్టణంలోని ఎమ్మెల్యే నివాస కార్యాలయంలో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ భార్గవ్ రామ్ దంపతులను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపే సన్మానించారు. ఈ సందర్భంగా ఏపీపీగా నియమితులైన న్యాయవాది ప్రతాప్ ను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు రమణయ్య ప్రసాద్ శ్రీనివాసులుతదితరులు పాల్గొన్నారు.

## రోడ్ల అభివృద్ధి పనులకు భూమి పూజ

**ఆళ్లగడ్డ ప్రతినిధి ఏప్రిల్ 22 పల్లె వెలుగు**



ఆళ్లగడ్డ మండలం ఓబులపల్లె గ్రామంలో ఎంపీ లాండ్స్ కింద, జెడ్ పి జి ఎఫ్ కింద మొత్తం20 లక్షలు నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. గ్రామ టీడీపీ నాయకుడు గౌరు రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ మహేంద్ర, పంచాయతీ సెక్రెటరీ బాలవర్ధిరాజు, టిడిపి నాయకులు గౌడ్ వెంకటరామిరెడ్డి, గౌరు మోహన్ రెడ్డి కమ్మగాల నరసింహులు ఆర్ బాల్రెడ్డి పోచన్న చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కర్నూలు నగరపాలక సంస్థ నూతన కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించిన చల్లా ఓబులేసు





**పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ :**

కర్నూలు నగరపాలక సంస్థ నూతన కమిషనర్ గా చల్లా ఓబులేసు బాధ్యతలు స్వీకరించారు. బుధవారం రాత్రి వెంకటరమణ కాలనీలోని నగరపాలక కార్యాలయంలో దస్త్రాలపై ఆయన సంతకాలు చేశారు. అధికారులు, ఉద్యోగులు, కాంట్రాక్టర్లు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందరి సహకారంతో నగరాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. అనంతరం విభాగధిపతులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, విభాగాధిపతులు, తదితరులు పాల్గొన్నారు.

## భక్తులకు తప్పిన ప్రమాదం

**మహానంది, పల్లె వెలుగు**



మహానంది పుణ్యక్షేత్రానికి భక్తులు దైవదర్శనానికి వచ్చారు. బుధవారం రాత్రి తిరుగు ప్రయాణమై ఓ వృద్ధ దంపతుల జంట వెళ్తుండగా,చిన్ననంది సమీపాన దేవస్థానంలోని కోనేర్ల నుంచి బయటకు వచ్చే నీటిప్రవాహపు కాల్వలోకి ఒకవైపు చక్రం ఇరుక్కుంది. అక్కడ పాత రేకుల డివైడర్ను గమనించక పోవడంతో కారు కాల్వలో చిక్కుకుంది.దీంతో అక్కడున్న దుకాణాదారులు, భక్తులు కారును ఎత్తి ప్రక్కకు లాగారు. ఈ ఘటనలో ఎవరికి ఎటువంటి ప్రమాదం చేసుకోకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

# అంగన్వాడీలకు అదనపు పని భారం మోపవద్దు





**-ఏపీ అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు జి. సేభ రాణి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వై ఎల్లయ్య.**

**పల్లె వెలుగు ఏప్రిల్ 22 (బేతంచెర్ల ప్రతినిధి):-**

ఐ సి డి ఎస్ ఆధ్వర్యంలో విధులు నిర్వహిస్తున్న అంగన్వాడి వర్కర్స్ కు అదనపు పని భారాన్ని మోపవద్దని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షులు జి. సేబా రాణి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వై ఎల్లయ్య అన్నారు. స్థానిక మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయం ముందు బుధవారం నాడు అంగన్వాడీలకు చాలీచాలని వేతనాలు ఇస్తూ అంగన్వాడీలు నిర్వహిస్తున్న విధులు కాకుండా అదనంగా జన గణన సర్వే వంటివి చేయాలని ప్రభుత్వ అధికారులు ఆర్డర్లు చేస్తున్న విధానంపై అంగన్వాడి వర్కర్స్ యూనియన్ కార్యదర్శి ఎస్ గుల్జార్ బి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మూడు సంవత్సరాల నుండి ఐదు సంవత్సరాల లోపు చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికరమైన ఆహారం అందిస్తూ వారికి ఆటపాటలతో విద్యాబుద్ధులు నేర్పిస్తున్న అంగన్వాడీలకు చాలీచాలని వేతనాలు ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాక ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇవ్వకపోగా, ప్రభుత్వ ఉద్యోగులుగా కంప్యూటర్లో ఫీడ్ అయిందని అంటారు తప్ప అంగన్వాడీల ప్రభుత్వ ఉద్యోగులుగా అధికారికంగా జీవోలు ప్రకటించకుండా ఇంటింటి సర్వే, గర్భిణీ స్త్రీలకు బాలింతలకు పౌష్టికరమైన ఆహారము వండి వడ్డించి అలాగే కిషోర్ బాలికలకు ఆరోగ్యం శుభ్రత పరిశుభ్రతలో తగు సూచనలు ఇస్తూ అనేక సేవలు సమాజానికి అందిస్తున్న అంగన్వాడీలను ఈ ప్రభుత్వం గుర్తించకపోవడం బాధాకరమని అన్నారు. గతంలో బిఎల్ఓ సర్వే అని అంగన్వాడీల చేత చేయించుకొని ఇంతవరకు ఒక్క రూపాయి కూడా చెల్లించకపోవడం ఎంతవరకు న్యాయమని వారు ప్రశ్నించారు. ప్రస్తుతం పాలక ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన జన గణన కార్యక్రమాన్ని అంగన్వాడీలు కూడా చేయాలని హుకుం జారీ చేయడం ఒకవేళ చేయకపోతే సోకాస్ నోటీసులు జారీ చేస్తామని బెదిరించడం సరైన పద్ధతి కాదని వారన్నారు. అంగన్వాడీలు వారి పనులు వాళ్లకు ఉన్నాయని ఆ విధులు నిర్వహించడంలో తల మున కలై ఇబ్బందులు పడుతుంటే మూల్గే నక్కపై తాటికాయ పడ్డట్టు పాలక ప్రభుత్వాలు జన గణన, బి ఎల్ ఓ సర్వే వంటి పనులను చేయాలని ఒత్తిడి పెట్టడం సరైంది కాదని వారు అన్నారు. అంగన్వాడీలు వారి విధులు తప్ప అదనపు పరివారం చేయరాదని ప్రభుత్వం సర్కులర్ కూడా జారీ చేసిందని అన్నారు. దయచేసి అంగన్వాడీలకు అదనపు పనిభారాలు పెట్టరాదని తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిప్యూటీ తాసిల్దారు మారుతి కి వినతి పత్రం స్థాపించారు. అలాగే బేతంచెర్ల నగర పంచాయతీ కార్యాలయము నందు కమిషనర్ హరిప్రసాద్ కూడా వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు ఉపాధ్యక్షులు బి రామాంజనేయులు, జీ వేణుగోపాల్, అంగన్వాడి పట్టణ అధ్యక్షురాలు రాజేశ్వరి, లక్ష్మీదేవి, రామ తులసి, ఆదిలక్ష్మి, అనూష, అరుణ, నారాయణమ్మ, సంతోషమ్మ, కళావతి, తదితరులు పాల్గొన్నారు.

# కేసముద్రం 11వ వార్డులో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసిన కౌన్సిలర్ ఆగే రాము



**కేసముద్రం, ఏప్రిల్ 22**

:కేసముద్రం మున్సిపల్ ఎన్నికల హామీల్లో భాగంగా కేసముద్రం మున్సిపాలిటీ 11వ వార్డు కౌన్సిలర్ ఆగే రాము ఇచ్చిన మాటకు కట్టుబడి రూ.1 లక్ష 2 వేల విలువైన 12 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి అందరికీ ఆదర్శంగా నిలిచారు. ఈ నేపథ్యంలో కేసముద్రం మున్సిపాలిటీ కేంద్రంలోని 11 వార్డు పరిధిలోని ఆదర్శ నగర్ ప్రాంతంలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జ్ క్రింద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను సీఐ సత్యనారాయణ ఆదేశాల మేరకు బుధవారం ఎస్సై క్రాంతి కిరణ్ తన బృందంతో పరిశీలించారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ ఒక సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని పేర్కొన్నారు. సీసీ కెమెరాల నిఘాతో నేర నియంత్రణకు చెక్ పెట్టొచని, సీసీ కెమెరాలు ఉన్న ప్రాంతంలో ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలు సాగించాలన్న బయపడాలన్నారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి ప్రజలకు, ఇటు పోలీసులకు తన వంతు సహకారం అందించిన 11 వార్డు కౌన్సిలర్ ఆగే రామన్నను పోలీసుల తరుపున అభిందించారు. కౌన్సిలర్ రామన్నను ఆదర్శంగా తీసుకోని మిగితా వార్డు కౌన్సిలర్లు తమ వంతుగా వారి వారి వార్డుల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నేర నియంత్రణకు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాజీ ఎంపీటీసీ ఆగే మంజుల వెంకన్న, మాజీ వార్డ్ మెంబర్ బిర్రు వెంకన్న, రొడ్డ రాజు , బోడ రవి, ఆగే దేవేందర్, ఆగే శ్రీను, ధరావత్ భీమ తదితరులు పాల్గొన్నారు.

# జలధార జల హారతితో కంచాలమ్మ గండి చెరువు పునర్జీవనం కల్పించాలి

**మాండవ్య నది అభివృద్ధికి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి దిశానిర్దేశం - సమగ్ర ప్రణాళికలు రూపొందించి ప్రతిపాదనలు సమర్పించాలి**

**జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్**

**కడప బ్యూరో చీఫ్ ఏప్రిల్ 22: పల్లె వెలుగు**



జిల్లాలో జలవనరుల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "జలధార జల హారతి" కార్యక్రమానికి భాగంగా రాయచోటి మండలం ఎగువ అబ్బవరం వద్ద ఉన్న కంచాలమ్మ గండి చెరువును బుధవారం రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖామంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఇరిగేషన్, డ్వామా అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి, కలెక్టర్ మాండవ్య నది నుంచి చెరువుకు వచ్చే నీటి ప్రవాహ మార్గాన్ని పరిశీలించి, ప్రస్తుత పరిస్థితులపై అధికారులతో సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... మాండవ్య నదిని పూర్తిగా శుభ్రపరిచి, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచే విధంగా చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. నదిలో అవసరమైన ప్రదేశాల్లో కొత్త చెక్ డ్యాములు నిర్మించడం, ఇప్పటికే దెబ్బతిన్న చెక్ డ్యాములను మరమ్మతు చేయడం ద్వారా నీటి నిల్వ పెంపుతో పాటు భూగర్భ జలాల స్థాయిని గణనీయంగా పెంచవచ్చని ఆయన పేర్కొన్నారు. కంచాలమ్మ గండి చెరువుకు నీరు చేరే సప్లై ఛానల్‌ను సరిచేసి, ఎక్కడైనా అడ్డంకులు ఉన్నా తొలగించి, నీటి ప్రవాహం నిరంతరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రి కలెక్టర్‌ను కోరారు. చెరువు పునరుద్ధరణతో పరిసర ప్రాంతాల్లో వ్యవసాయానికి ఊతం లభించడంతో పాటు తాగునీటి సమస్యలు కూడా తగ్గుముఖం పడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అదేవిధంగా మాండవ్య నదిని కేవలం నీటి వనరుగా మాత్రమే కాకుండా, అందంగా తీర్చిదిద్దేలా బ్యూటిఫికేషన్ కార్యక్రమాలు చేపట్టాలని మంత్రి సూచించారు. గాలివీడు రింగ్ రోడ్ సమీపంలో ఉన్న ట్యాంకును కూడా కలెక్టర్ తో కలిసి మంత్రి పరిశీలించి, నీటి ప్రవాహ పరిస్థితులను అంచనా వేసి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. మంత్రిసూచనల మేరకు చేపట్టాల్సిన అన్ని పనులపై సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేసి, తక్షణమే ప్రతిపాదనలు సమర్పించాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. వివిధ అంశాలలో వేగవంతమైన చర్యలు తీసుకొని, జలధార కార్యక్రమాన్ని ఫలితాల ఆధారితంగా విజయవంతం చేయాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్, డ్వామా మరియు సంబంధిత విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికుల డిమాండ్లు వెంటనే పరిష్కరించాలి

**ఎంసీపీఐయు జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న డిమాండ్.**



**కేసముద్రం, ఏప్రిల్ 22**

:కేసముద్రం మండలం వ్యవసాయ మార్కెట్ సెంటర్ లో ఎంసిపిఐయు అనుబంధ ఏఐసిటియు కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఆర్టీసీ కార్మికుల సమ్మెకు మద్దతుగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంసిపిఐయు మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. రవాణా రంగం స్తంభించి పోవడం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, ఇప్పటికైనా ప్రభుత్వం కాలయాపన చేయకుండా వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెకు ఎంసిపిఐయు అనుబంధ ఏఐసిటియు కార్మిక సంఘం సంపూర్ణ మద్దతు తెలుపుతూ, వారికి మద్దతుగా ప్రత్యక్ష పోరాటాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో వేల్పుల వెంకన్న, గుగులోతు లక్ష్మణ్, అందే భాస్కర్, రాస ఉప్పలయ్య, కస్తూరి వెంకన్న, బోడ వీరన్న నాయక్, సునీల్, మురళి, నేరడ వీరస్వామి, బిక్కు నాయక్, సురేష్, సంజీవ, బానోత్ ఈసు తదితరులు పాల్గొన్నారు.

# అకాల వర్షం -అరటి రైతుకు తీవ్ర నష్టం







**ఆదుకోవాలంటూ అన్నదాతల వేడుకోలు..**

**మహానంది, పల్లె వెలుగు**

మహానంది మండలంలో అకాల వర్షంతో రైతులకు అపార నష్టం కలిగించింది.బుధవారం సాయంత్రం ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన అకాల వర్షానికి అరటి తోటలు నేల వాలాయి.పంట చేతికొచ్చే సమయంలో ఇలా ఈదురు గాలులకు నేలమట్టం కావడంతో రైతులు వ్యక్తం చేస్తున్నారు. తిమ్మాపురంలో కొన్ని ఎకరాల్లో అరటి పంట నేల వాలినట్లు రైతులు తెలిపారు. ఆరుగాలం కష్ట పడి లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టి పంట చేతికి అందుతున్న తరుణంలో అకాల వర్షంతో తీవ్రంగా నష్టం పోయామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.గత ఏడాది మే నెల లో అకాల వర్షాలు కురిస్తేడ ప్రస్తుతం ఏప్రియల్ నెలలోనే వానలు పడుతున్నాయని, దీంతో రైతులకు అపార నష్టం వస్తుందని అన్నదాతలు వాపోతున్నారు.ఈ అకాల వర్షాలతో రైతులకు భారీ నష్టం వాటిల్లుతుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బలమైన ఈదురు గాలులతో వాన కారణంగా చేతికొచ్చిన వరి,మొక్కజొన్న, మామిడి రైతులు నష్టపోయారు. ఎక్కువ మొత్తంలో అరటి, మామిడి రైతులను అకాల వర్షం నష్టపరిచింది. పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు. వరి,మొక్కజొన్న పంటల దిగుబడిని కల్లాల్లో, రోడ్ల వెంబడి ఆరబెట్టుకున్న రైతులు టార్పాలిన్ పట్టాలు కప్పుకొని భద్రపరుచుకున్నారు. మండలంలోని గ్రామాల్లో గత కొన్ని రోజులుగా తీవ్రమైన వడగాడ్పులతో సతమతమవుతున్న ప్రజలకు ఈ వర్షం ఊరటనిచ్చింది.

# సాలూరులో ప్రారంభానికి నోచని అన్న క్యాంటీన్



సాలూరులో అన్న క్యాంటీన్ భవన నిర్మాణం పూర్తయినా.. ప్రారంభానికి నోచుకోవడం లేదు. కోర్టులో స్థల వివాదం నడుస్తుండడమే ఇందుకు కారణం. మొత్తంగా పేదలు, గిరిజనులు పట్టెడన్నం కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. ప్రారంభోత్సవానికి నోచని అన్న క్యాంటీన్ భవనం. వాస్తవంగా సాలూరు నియోజకవర్గంలో గిరిజనులు ఎక్కువ. విద్య, వైద్యంతో పాటు వస్తుంటారు.వ్యాపారులు ఇలా ఎంతోమంది వివిధ పనుల కోసం పట్టణానికి వస్తుంటారు.

# సమాజసేవయే రోటరీ క్లబ్ సేవలు

## -డి.ఎస్.పి ఏ శ్రీనివాసులు







ఆళ్లగడ్డ ప్రతినిధి ఏప్రిల్ 22 పల్లె వెలుగు

సమాజ సేవయే రోటరీ క్లబ్ సేవలని ఆళ్లగడ్డ డిఎస్పీఏ శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం ఆయన పట్టణంలోని చింతకుంట సమీపంలో ఉన్న బాలసదన్ శరణాలయం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీఏ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రపంచమంతటా అన్ని దేశాలలో సమాజ సేవలో రోటరీ క్లబ్ ముందు ఉందని అలాగే ఆళ్లగడ్డ రోటరీ క్లబ్ కూడా సమాజ సేవా రంగంలో ఆయన అన్నారు. రోటరీ క్లబ్ లాంటి సేవా సంస్థలు ఇలాంటి కార్యక్రమాలు చేయడం మంచి పరిణామం అని అనాధ పిల్లలకు ఆదుకోవడం మన ధర్మం అన్నారు. మానవసేవయే మాధవసేవ అని క్లబ్బు అధ్యక్షులు మిగతా సభ్యులందరూ ఇలాంటి కార్యక్రమాలు చేయడం సంతోషమన్నారు. తాను బాపట్ల,నెల్లూరు డీఎస్పీగా పనిచేసే రోజుల్లో అక్కడున్న రోటరీ క్లబ్ మంచి సత్సంబంధాలు ఉన్నాయని ప్రతి సంవత్సరం అక్టోబర్ 21 పోలీసు సంస్కరణ దినోత్సవం సందర్భంగా రోటరీ క్లబ్ వారి సహకారంతో రక్తదాన కార్యక్రమాలు చేశామన్నారు,పుట్టినరోజు సందర్భంగా ఎన్నో మంచి కార్యక్రమాలు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో చేశామన్నారు. సమాజంలో సేవ చేయాలని దేవుడు సంకల్పించారు కాబట్టి అవకాశాన్ని రోటరీక్లబ్ సభ్యులకి ఇవ్వడం ఆనందదాయకమన్నారు . రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు ఆళ్లగడ్డ రోటరీ క్లబ్ చేయాలని కోరుతూ సభ్యులందరినీ అభినందిస్తూ తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామనిఆయన తెలిపారు. పట్టణ సీఐ నాగరాజరావు మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఇలాంటి మంచి కార్యక్రమాలు చేస్తున్నారని రోటిరీ క్లబ్ సభ్యులందరూ తమ సొంత నిధులతో సేవలు చేయడం గొప్ప పరిణామం అన్నారు. ఆళ్లగడ్డ క్లబ్బు సభ్యులందరినీ ఆయన అభినందించారు. రోటరీ క్లబ్బు అధ్యక్షులు పోలేపల్లె సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి బైసాని రవి ప్రకాష్ రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షులు ప్రముఖ పారిశ్రామికవేత్త టీఎంసీ వేణుగోపాల్ రోటరీ క్లబ్బు చేసిన కార్యక్రమాల గురించి వివరించారు. అనంతరం 40 మంది బాలికలకు 80 జతల వేసవి దుస్తులను అతిథులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి డిఎస్పి ఏ శ్రీనివాసులు క్లబ్బు సభ్యులందరూ శాలువాలతో పూలమాలలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో శబరిష్ సత్యం అధ్యాపకులు మల్లేశ్వర్ రెడ్డి బాలిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు రామచంద్రారెడ్డి రత్నరాజు చంద్ర సేన ఇన్నర్ విల్ అధ్యక్షులు కవిత సెక్రటరీ ఉమామహేశ్వరి గీతా సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

# కమ్యూనిజంతోనే దేశంలో ప్రజా విముక్తి జరుగుతుంది

సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ నాయకులు అన్నారపు హనుమంతు.



కేసముద్రం, ఏప్రిల్ 22

కమ్యూనిజం తోనే దేశంలో ప్రజా విముక్తి జరుగుతుందని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ నాయకులు అన్నారపు హనుమంతు అన్నారు. బుధవారం మండలంలోని గ్రామ గ్రామాన ఘనంగా సిపిఎంఎల్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించగా, కేసముద్రం పట్టణ కేంద్రంలో బట్టమేకల రాజు అధ్యక్షతన సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ నాయకులు అన్నారపు హనుమంతు జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం పి.చంద్రమౌళి అధ్యక్షతన బొమ్మగాని వెంకన్న మాట్లాడుతూ మార్క్సిస్టు మహోపాధ్యాయుడు జయంతి సందర్భంగా ఆవిర్భవించిన సిపిఐ ఎంఎల్ పార్టీని 57 సంవత్సరాలుగా ప్రజల కోసం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న విప్లవ పార్టీ సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ అన్నారు. అన్నారపు హనుమంతు మాట్లాడుతూ అనేక పోరాటాలు నిర్వహించి సాధించుకున్న తెలంగాణలో 9 సంవత్సరాలు పరిపాలించిన కేసీఆర్ ప్రభుత్వం చేసింది ఏమీ లేదని, ప్రజలు కెసిఆర్ ను గద్దె దింపి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గెలిపిస్తే అనేక హామీలు ఇచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజల్ని ప్రలోభాలు పెట్టి గద్దెనెక్కిన తర్వాత ప్రజలకు మొండి చేయి చూపించిన పరిస్థితి ఉందని, ఇప్పటికైనా ప్రజలు చైతన్యంతో కమ్యూనిస్టు పార్టీ ప్రజా పోరాటాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో బట్టమేకల రాజు, పిన్నోజు చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరం

## -ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ







టైక్వాండో నేర్చుకునే ఆడపిల్లలకు మేము అండగా ఉంటాం -ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

ఆళ్లగడ్డ ప్రతినిధి, ఏప్రిల్ 22 పల్లె వెలుగు

విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు కూడా ఎంతో అవసరమని ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ అన్నారు. ఆళ్లగడ్డపట్టణ శివారులోని కందుకూరు రోడ్డులో ఉన్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థుల ఆత్మరక్షణ నైపుణ్యాల పెంపుకు తైక్వాండో ప్రదర్శన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, డీఎస్పీ శ్రీనివాసరావు, పట్టణ సీఐ నాగరాజరావు, ఎస్ఐ చిన్న పిరయ్య, ఎంఈఓ శోభా వివేకవతి హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు తైక్వాండోలో తమ ప్రతిభను చాటుతూ వివిధ విన్యాసాలు ప్రదర్శించారు. వేగం, సమన్వయం, ధైర్యంతో చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా ఆత్మరక్షణ పద్ధతులను ప్రాక్టికల్‌గా చూపించడం అందరినీ మెప్పించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు ఆత్మరక్షణ నైపుణ్యాలు కూడా అలవర్చుకోవడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. టైక్వాండో అనేది ఆడపిల్లల సంరక్షణ కోసం అని, ఏదో ఇప్పుడు నేర్చుకున్నాం కదా అని వదిలేయకుండా మంచి



ఉన్నత స్థానాలకు వెళ్లాలన్నారు. ఆడపిల్లలంటే అన్ని రంగాల్లో ముందు ఉంటారని సమాజానికి తెలియజేయాలన్నారు. రాబోయే రోజుల్లో ఆళ్లగడ్డ కచ్చితంగా సాధిస్తుందని టైక్వాండో నేర్చుకునే ఆడపిల్లలకు మేము అండగా ఉంటామన్నారు.

# పిల్లల భవిష్యత్తుకు ప్రీ ప్రైమరీ విద్య పునాది

కేసముద్రం మున్సిపల్ చైర్ పర్సన్ బానోత్ సునీత వెంకన్న



కేసముద్రం, ఏప్రిల్ 22



పిల్లల భవిష్యత్తుకు ప్రీ ప్రైమరీ విద్య పునాది లాంటిదని కేసముద్రం మున్సిపల్ చైర్ పర్సన్ బానోత్ సునీత వెంకన్న అన్నారు. మంగళవారం కేసముద్రం మున్సిపల్ పరిధిలోని విలేజ్ కేసముద్రం ప్రీ ప్రైమరీ స్కూల్లో నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమానికి కేసముద్రం మున్సిపల్ చైర్ పర్సన్ బానోత్ సునీతవెంకన్న, వైస్ చైర్ పర్సన్ డాక్టర్ అల్లం రమ నాగేశ్వర్ రావు, కౌన్సిలర్లు, అధికారులతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి సమాజంలో విద్యార్థి దశ అత్యంత కీలకమైందని, అందులోనూ ప్రీ ప్రైమరీ విద్య అనేది పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు మొదటి మెట్టన్నారు. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న చిన్నారులకు మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్ చేతుల మీదుగా పట్టాలను అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. పిల్లల ప్రతిభను ప్రత్యేకంగా వీక్షించి అభినందించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వివేక్, ఎంపీడీవో క్రాంతి, సిడిపిఓ శిరీష, కౌన్సిలర్స్ వేముల భారతి, కనుకుల సుభద్ర, వల్లందాసు ఉమ, మేకల శారద,రావుల వినయ్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

# వసతి గృహాల పనితీరును మెరుగుపరచడం, విద్యా ప్రమాణాలను పెంచడంలో అధికారులు శ్రద్ధ వహించాలి







స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో.

కేసముద్రం, ఏప్రిల్ 22 : పల్లె వెలుగు

99 రోజుల ప్రజాపాలన ప్రణాళికలో భాగంగా మహబూబాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో బుధవారం కేసముద్రం మండలంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మండలం లోని గిరిజన సంక్షేమ బాలికల కళాశాల, కేజీబీవీ కళాశాలను సందర్శించి విద్యార్థులకు అందుతున్న వసతులు, భోజన నాణ్యత, విద్యా బోధనను పరిశీలించారు. పాఠశాల నిర్వహణ, రికార్డులు, హాజరును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ హాస్టళ్లలో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ సౌకర్యాలు నిరంతరం అందుబాటులో ఉండాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని, వంటశాలలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. విద్యార్థుల చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పెండింగ్‌లో ఉన్న చిన్నపాటి మరమ్మతు పనులను తక్షణమే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ వసతి గృహాల పనితీరును మెరుగుపరచడంలో, విద్యా ప్రమాణాలను పెంచడం అధికారుల యొక్క కర్తవ్యమన్నారు. అదనపు కలెక్టర్ వెంట స్థానిక మండల అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వాలు హాస్టల్ ఏర్పాటు చేస్తే విద్యార్థులకు విష భోజనాలు పెడుతున్న ప్రిన్సిపాల్









ప్రభుత్వాలు పిల్లలకు సరైన భోజనం పెట్టమని చెప్పితే
ఎవరికైనా చెప్పితే టీసీలిచ్చి పంపిస్తా విద్యార్థుల పైన కక్ష
నేను మహిళా ప్రిన్సిపాల్ నామీద ఎవరైనా కంప్లీట్ ఇస్తే
నేను కేసులతోని భయపెట్టిస్తా అంటున్న ప్రిన్సిపాల్
పిల్లలకి సరైన భోజనం అందించమంటే ఏదో ఒకటి
సాకులు చెపుతున్న ప్రిన్సిపాల్
బిజెపి ఇన్చార్జి దేశాయ్ గురురాజ్

**నందవరం పల్లె వెలుగు ఏప్రిల్ 22**

కేజీబీవీ విద్యార్థుల ప్రాణాలతో ప్రిన్సిపల్ చలగాటం మండలకేంద్రంయిన నందవరం కేజీబీవీ హాస్టల్ లో జరిగిన దారుణం ఆలస్యంగా వెలుగులోకొచ్చిన వైనం. ఈ నెల 17 వ తేదీన బల్లి పడిన భోజనాన్ని విద్యార్థులకు పెట్టిన వంట నిర్వహకులు. బల్లి పడిందని విద్యార్థులు చెప్పితే తినండి ఏమి కాదులే అంటూ నవ్విన వంట సిబ్బంది. తల్లిదండ్రులకు చెపితే టీసీలు ఇస్తామంటూ విద్యార్థులకు బెదిరింపులు బల్లి కాదు,మిడత అంటున్న ప్రిన్సిపల్ కేజీబీవీ విద్యార్థుల ప్రాణాలతో ప్రిన్సిపల్, వంట సిబ్బంది చలగాటమాడుతున్నారని విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు మా దృష్టికి తెలిపారు. 17 వ తేదీన జరిగిన పరిస్థితిని బయటకు రాకుండా విద్యార్థులను భయభ్రాంతులకు గురి చేశారని, ఎండాకాలం సెలవులు సందర్భంగా ఈరోజు బయటికి వచ్చిన విద్యార్థులు తమ తల్లిదండ్రులకు తెలిపి తమ పరిస్థితిని వివరించారని తెలిపారు. ఉన్నత అధికారులు విచారణ చేపట్టి ప్రిన్సిపల్ పైన, వంట సిబ్బంది పైన కఠినమైన చర్యలు తీసుకోవాలి, ఇలాంటి అధికారుల నిర్లక్ష్యంవలన 200 మంది విద్యార్తులు విష ఆహారం తిన్నతరువాత వాంతులు చేసుకొవడం జరిగింది. ఎంతో గౌరవంతో హాస్టల్ మీద నమ్మకంతో పేద కుటుంభంనుండి వచ్చిన విద్యార్థులకు సరైన సౌకర్యం కల్పించక అభద్రతా భావంతో అటు తల్లిదండ్రులకు చెప్పుకోలేక విద్యార్థులు చాలా అవస్తలు పడుచున్నారు. విష ఆహారం వలన విద్యార్థులకు ఎదయినా జరిగితే ఎవరు బాధ్యత తీసుకొంటారు? ఒక బాధ్యతాయుత అధికారిగా ఉండి విద్యార్థుల విషయంలొ ప్రతి విషయంలోను నిర్లక్ష్యంచేస్తూ విద్యార్థులపాలిట



శాపంగా మారిన కేజీబీవీ ప్రిన్సిపల్ మీద శాఖాపరమైన విచారణ చేసి తక్షణమే విధులనుండి సస్పండ్ చెయ్యాలని ఈ విషయంపై రాబొయే సొమవారం బిజెపి జనతా వారిది్రా+=ా కార్యక్రమంలో తగిన ఆధారాలతో జిల్లా కలెక్టరు కి పిర్యాదుచేస్తామని తెలిపారు. ప్రిన్సిపల్ కి ఈ విషయంపై అరా తియ్యగా ఆ రోజు పడింది బల్లి కాదు, మిడత అంటూ సమాధానం ఇచ్చారు. విద్యార్థులు మాత్రం మిడత కాదు బల్లి పడిందని ఫోను ద్వారా తమకు తెలిపారన్నారు. పేద విద్యార్థుల కోసం నేను దేనికైనా సిద్ధం అంటున్న ఎమ్మిగనూరు బిజెపి ఇన్చార్జి దేశాయ్ గురురాజ్ అన్నారు.

# మార్క్సిజం-లెనినిజం-మావో ఆలోచనా విధానమే దేశ విముక్తి సిద్ధాంతం

సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మండల వెంకన్న

**మహబూబాబాద్, ఏప్రిల్ 22 పల్లె వెలుగు**



మార్క్సిస్టు మహోపాధ్యాయుడు కామ్రేడ్ లెనిన్ జయంతిని పురస్కరించుకొని సిపిఐ(ఎంఎల్) ఆవిర్భావ దినోత్సవాన్ని మహబూబాబాద్ పట్టణం లోని సామ పూలక్క నగర్, విక్రమ్ నగర్ కాలనీ, మాధవన్న నగర్, భట్టు అంజయ్య నగర్, కనకయ్య నగర్, ప్రగతి నగర్, పైలా వాసుదేవరావు నగర్ కాలనీల తో పాటు గుమ్ముడూరు లోని బట్టు అంజయ్య స్మారక భవనంపై సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జెండాను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ మండల వెంకన్న మాట్లాడుతూ భూమి, భుక్తి, ఈ దేశ విముక్తి కోసం 1969 లో రివిజనిస్టు నయా రివిజనిస్టులతో తెగదెంపులు చేసుకొని సిపిఐ(ఎంఎల్) ఆవిర్భవించిందన్నారు. ఆవిర్భవించిన నాటి నుండి నేటి వరకు సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో అనేక ప్రజా పోరాటాలు నిర్వహించామన్నారు. లక్షలాది ఎకరాల భూములను పేద ప్రజలకు, గిరిజనులకు పంచిపెట్టామన్నారు. అనేక గ్రామాలు నిర్మించామన్నారు. ప్రజలకు నిత్యం ఎదురయ్యే సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు నిర్మించామన్నారు. ప్రస్తుతం భారతదేశంలో మతోన్మాద ఫాసిస్టు భావజాలంతో బిజెపి ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోడీ పని చేస్తున్నారన్నారు. రాజ్యాంగాన్ని మార్చివేసి మనువాద సిద్ధాంతాన్ని ముందుకు తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు. మాట్లాడే వాళ్ళపై నిర్బంధం ప్రయోగించి అణచి వేస్తున్నారన్నారు. దళితులు, ఆదివాసీలు, గిరిజనులు, మైనారిటీల పైన రోజురోజుకు దాడులు కొనసాగిస్తున్నారు. దేశ సంపదను కార్పొరేట్ కంపెనీలకు, ధనిక వర్గాలకు, ప్రైవేటు శక్తులకు దోచిపెట్టే నిర్ణయాలు చేస్తున్నారన్నారు. దేశాన్ని తాకట్టు పెట్టి దేశ సంపదను లూటీ చేస్తున్నారన్నారు. మరోపక్క సామ్రాజ్యవాదం బుసలు కొడుతూ ప్రపంచ యుద్ధాలను ప్రేరేపిస్తున్నారన్నారు. మరోపక్క రాష్ట్రంలో దొంగలు పడి ప్రజల సంపదను యావత్ రాష్ట్రాన్ని దోచుకుంటున్నారన్నారు. ఎన్నికల నాడు అనేక ఉచిత వాగ్దానాలు, హామీలు ఇచ్చి అవి నెరవేర్చలేని స్థితిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అధికార యంత్రాంగం ఉందన్నారు. ప్రభుత్వ భూములను కబ్జాలు చేయడమే పనిగా పెట్టుకుని దోపిడీని యధేచ్ఛగా కొనసాగిస్తున్నారు. దేశంలో, రాష్ట్రంలో దళారీ ప్రభుత్వాలు కొనసాగుతున్నాయన్నారు. ఈ దళారీ ప్రభుత్వాలను కూల్చివేయడానికి విప్లవకారులంతా ఐక్యం కావాలన్నారు. దేశంలో వర్గాలు లేని సమ సమాజాన్ని స్థాపించాలంటే నూతన ప్రజాస్వామిక విప్లవమే మార్గమన్నారు. దేశంలో ప్రజలందరూ స్వేచ్ఛా, సమానత్వంతో జీవించాలంటే మార్క్సిజం-లెనినిజం- మావో ఆలోచనా విధానంలో సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. బూర్జువాలకు, భూస్వాములకు, పెత్తందారులకు, పెట్టుబడుదారులకు, సామ్రాజ్యవాదులకు ఊడిగం చేసే దళారీ నిరంకుశ ప్రభుత్వాలను కూకటి వేళ్ళతో కూల్చి వేయాలన్నారు. నూతన ప్రజాస్వామిక వ్యవస్థను నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్స్ హలవత్ లింగన్న, గుజ్జు దేవేందర్, బట్టు చైతన్య, పర్వత కోటేష్, ఎండి జబ్బార్, కుక్కమూడి యాకయ్య, గుండెల కృష్ణ, గుజ్జు కృష్ణవేణి, సామ రజిత, మంద మామిడి, వెంకన్న, నూకల మురళి, పొన్నం రమ, అల్లి ఏకాంబరం, మునీత, కల్పన, జంపాల ఉపేందర్, ధర్మారపు ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి: వట్టే జానయ్య యాదవ్

పిఆర్పి ఆర్టీసీ కార్మికుల సమ్మెకు మద్దతు



**సూర్యాపేట టౌన్ ఏప్రిల్ 22**

ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టే జాన యాదవ్ అన్నారు. బుధవారం ఆర్టీసీ కార్మికుల సమ్మెకు మద్దతుగా సూర్యాపేట డిపో వద్ద సమ్మేలో మద్దతుగా సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వట్టే జానయ్య యాదవ్ మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సంవత్సరాలుగా సేవలు అందిస్తున్న కార్మికులను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేయడం దురదృష్టకరమని అన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్మికుల హక్కుల కోసం ఎప్పటికప్పుడు టి ఆర్ పి పార్టీ ముందుండి పోరాడుతుందని హామీ ఇచ్చారు. ఈ సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ప్రభుత్వం తక్షణమే చర్చలకు ముందుకు వచ్చి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.ఈ కార్యక్రమంలో టిఆర్పి జిల్లా అధ్యక్షులు మామిడి అంజయ్య, మహిళా విభాగం అధ్యక్షురాలు కొన్నే మంజుల గౌడ్, ఆత్మకూరు (ఎస్) మండల పార్టీ అధ్యక్షులు బొల్లె సైదులు, వల్లాల సైదులు యాదవ్, లింగాల సైదులు, నేలచర్ల మధు ప్రజాపతి, సట్టు నాగయ్య, ఎస్.కె బారి, పిడమర్తి ఉపేందర్, వట్టే లింగరాజు యాదవ్, మామిడి ఉదయ్,కడియం వంశీ, లచ్చయ్య, సుధాకర్, సాగర్ రవి, పీఎం రావ్, డి ఆర్ కుమార్, మహిళా నాయకురాలు రాజేశ్వరి, మాదవి సావిత్రి, స్వరూప, శ్రీరామ్, సందీప్, వెంకన్న, కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు , పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పోషకాహారంతోనే తల్లి బిడ్డ క్షేమం



41 వ వార్డు అన్నాదురై నగర్ అంగన్వాడి సెంటర్లో పోషణ్ పక్వాడ
గర్భిణీలకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన, గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్ల పంపిణీ

**సూర్యాపేట టౌన్ ఏప్రిల్ 22 పల్లె వెలుగు**

గర్భిణీ స్త్రీలు బాలింతలు పోషకాహారం తీసుకోవాలని అప్పుడే తల్లి బిడ్డ క్షేమంగా ఉంటారని ఐసిడిఎస్ సిడిపిఓ సుబ్బలక్ష్మి, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, నాగమణి క్యాటరింగ్స్ అధినేత నకిరేకంటి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 41 వ వార్డు అన్నాదురై నగర్ సెక్టర్ అంగన్వాడి సెంటర్ లో నిర్వహించిన పోషన్ పక్వాడ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. అంగన్వాడీ కేంద్రంలో అందిస్తున్న బాలామృతం తో పాటు ఆకుకూరలు, పప్పు కోడిగుడ్లను గర్భిణీలు బాలింతలు చిన్నారుల తల్లులు సదినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా గర్భిణీలు పౌష్టికరమైన ఆహారం తీసుకోవడంతో ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మను ఇవ్వవచ్చన్నారు. ముఖ్యంగా ఆకుకూరలు, పండ్లు ఇతర పోషక ఆహారాలను అధికంగా తీసుకోవాలని సూచించారు. అంగన్వాడి కేంద్రాలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకొని తమ చిన్నారులను సెంటర్లకు పంపించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. అనంతరం గర్భిణీలకు సామూహిక సీమంతాలు నిర్వహించి, చిన్నారులకు అన్నప్రాసన తో పాటు అంగన్వాడి సెంటర్ నుంచి పాఠశాలకు వెళుతున్న చిన్నారులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్ వైజర్ జ్యోతి,అంగన్వాడి టీచర్ సువర్ణ, వార్డు అభివృద్ధి అధికారి శ్వేత,బి అంగన్వాడి ఆయా నవ్య, వార్డు ప్రముఖులు రమణ తదితరులు పాల్గొన్నారు.

# పట్టణాల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత కల్పిస్తుంది

ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పన్నులు చెల్లించాలి.

విద్యాశాఖలో పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలి.

మున్సిపల్ కమిషనర్లు, విద్యాశాఖ, ఇంజనీరింగ్ విభాగం సిబ్బందితో సుదీర్ఘంగా కలెక్టర్ సమావేశం

**మహబూబాబాద్, ఏప్రిల్ 22 పల్లె వెలుగు**



పట్టణాలు, గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకొని అధిక నిధులు కేటాయించడం జరుగుతుందని, గ్రామాలు పట్టణాలలో ప్రజలు తమ ఇంటి పన్ను, నల్ల పన్నులను బాధ్యతాయుతంగా చెల్లించి గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి సహకరించాలని, విద్యాశాఖలో పెండింగ్లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, మహబూబాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గుగులోతు జ్యోతి, కేసముద్రం మున్సిపల్ చైర్ పర్సన్ బానోతు సునీత, వైస్ చైర్ పర్సన్ అల్లం రమ, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత ఇంజనీరింగ్, హెల్త్, శానిటేషన్, విద్యాశాఖ సిబ్బందితో పెండింగ్ పనులు అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సహకారంతో పాటు ప్రజల సహకారంతో పట్టణాల అభివృద్ధికి సహకరించాలని, ఇంటి పన్ను, నల్లా పన్ను, ట్రేడ్ లైసెన్స్, లే అవుట్ అనుమతుల ద్వారా నిధులు సేకరించాలని, పన్నుల వసూళ్లకు విస్తృత ప్రచారం కల్పించాలని, బల్క్ ఎస్ఎంఎస్ ల ద్వారా ప్రజలకు తెలియపరచాలని సూచించారు. మున్సిపల్ పరిధిలో నిత్యం సానిటేషన్ నిర్వహిస్తూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దశలవారీగా సిబ్బందిని కేటాయించాలని, వారికి షెడ్యూల్ ప్రకారం వైద్య పరీక్షలు నిర్వహించాలని, యూనిఫామ్స్ ఇతర సదుపాయాలు కల్పించాలని సూచించారు. బయోమెట్రిక్ విధానం ద్వారా హాజరు నమోదు చేయాలని తెలిపారు. ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని మిషన్ భగీరథ, మున్సిపల్ ద్వారా అందించే వాటర్ సప్లై నిత్యం గమనిస్తూ ఉండాలని, అవసరం ఉన్నచోట టాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని తెలిపారు. ఒక ప్రణాళిక ప్రకారం అన్ని విభాగాల సిబ్బంది పనిచేసి పట్టణాల అభివృద్ధికి కృషి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ స్థలాలలో అక్రమ నిర్మాణాలను అరికట్టాలని ఆదేశించారు, శానిటేషన్ పై ప్రత్యేక శ్రద్ధ వహించి అవసరం ఉన్నచోట ఆటోలు ట్రాక్టర్స్ ఇతర వాహనాల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని సూచించారు. కేసముద్రం నూతన మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపాలన్నారు. మహబూబాబాద్, కేసముద్రం మున్సిపల్ చైర్ చైర్ పర్సన్ లు పట్టణాల అభివృద్ధి కోసం పలు సూచనలు సలహాలు అందించారు. అంతర్గత రోడ్ల నిర్మాణం, అభివృద్ధి పనులు, పార్కులు, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ వినియోగంలోకి తీసుకురావడం కోసం చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా ప్రతినిధులు, ఉద్యోగులు సమన్వయంతో కలిసి పనిచేసి పట్టణాలు గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఆమె సూచించారు. విద్యాశాఖలో సుమారు 839 పాఠశాలలలో వివిధ అభివృద్ధి పనులు కిచెన్ షెడ్, డైనింగ్ హాల్, టాయిలెట్స్, కాంపౌండ్ వాల్, త్రాగునీరు సరఫరా సిస్టం, మైనర్ రిపేర్, మన ఊరు మన బడి, అమ్మ ఆదర్శ పాఠశాల ద్వారా మంజూరు అయిన పనులు కొన్ని పెండింగ్లో ఉన్నందున వెంటనే పూర్తి చేయాలని సంబంధిత పంచాయతీరాజ్, రహదారులు భవనాల శాఖ, ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్ విభాగం, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ సంస్థ, ఈడబ్ల్యూఐసి, అధికారులు ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యా శాఖ అధికారి రాజేశ్వర్, కేసముద్రం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, మహబూబాబాద్ ఇంచార్జీ కమిషనర్ ఉపేందర్, టిపిఓ సాయి రామ్, ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్, విద్యా శాఖ ఇంజినీరింగ్, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈలు తదితరులు పాల్గొన్నారు.

# చేనేత టెండర్ విధానం రద్దుపై కొత్తవాడ కార్మికుల హర్షం

టెస్కో ద్వారానే కొనుగోలు చేయాలని డిమాండ్

టెండర్ విధానానికి స్వస్తి పలకాలి

టెస్కో ద్వారానే వస్త్రాల కొనుగోలు ప్రక్రియను కొనసాగించాలి.

చేనేత కార్మికులకు నిరంతర పని కల్పించి వారిని ఆర్థికంగా ఆదుకోవాలి

**వరంగల్ ఏప్రిల్ 22 పల్లె వెలుగు**



ప్రభుత్వ శాఖలకు అవసరమైన వస్త్రాలను టెండర్ విధానం ద్వారా కాకుండా, గతంలో మాదిరిగానే టెస్కో ద్వారానే కొనుగోలు చేయాలని హైకోర్టు ఇచ్చిన తీర్పు పట్ల తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర మీడియా కార్యదర్శి రాంపెల్లి లింగమూర్తి హర్షం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా వరంగల్ కొత్తవాడ వంటి ప్రాంతాల్లోని నేత కార్మికులకు ఈ తీర్పు పెద్ద ఊరటనిస్తుందని ఆయన పేర్కొన్నారు. నేత కార్మికులకు న్యాయం జరుగుతుందని గతంలో ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం.1 ప్రకారం రెసిడెన్షియల్ పాఠశాలలు, ఇతర విభాగాలకు కావాల్సిన యూనిఫాంలు, బెడ్‌షీట్లు, జంబుఖానాలను టెస్కో నుంచే సేకరించాల్సి ఉంది. అయితే టెండర్ విధానం వల్ల కార్మికుల ఉపాధి దెబ్బతినే ప్రమాదం ఏర్పడిందని, దీనిపై వరంగల్‌కు చెందిన వీరాంజనేయ హ్యాండ్లూమ్ సొసైటీ న్యాయపోరాటం చేసి విజయం సాధించిందని చేశారు. హైకోర్టు ఆదేశాలను గౌరవించి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే టెండర్ విధానానికి స్వస్తి పలకాలని ఆయన కోరారు. కొత్తవాడలోని వందలాది చేనేత కుటుంబాలకు ఉపాధి దొరకాలంటే టెస్కో ద్వారానే ఆర్డర్లు ఇచ్చి పని అని కనిపించాలని డిమాండ్ చేశారు. కార్మికులను ఆర్థికంగా ఆదుకోవడానికి ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలి. చేనేత కార్మికుల పక్షాన నిలిచిన హైకోర్టుకు, తీర్పునిచ్చిన జస్టిస్ జూకంటి అనిల్ కుమార్‌కు ఈ సందర్భంగా ఆయన ధన్యవాదాలు తెలిపారు.

# శ్రీ లక్ష్మీ నరసింహ తిరు కళ్యాణోత్సవములకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలి : కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేట కలెక్టరేట్ ఏప్రిల్ 22 పల్లె వెలుగు**



శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం, మట్టపల్లి మహా క్షేత్రం, మఠపల్లి నందు శ్రీ స్వామివారి తిరు కల్యాణ మహోత్సవములు, ఈనెల29 నుండి వచ్చేనెల 4 వరకు నిర్వహించుటకు గాను ముందస్తు ఏర్పాట్ల పై సంబంధిత శాఖల అధికారులతో సమీకృత కలెక్టరేట్ కార్యాలయ సముదాయం లోని వి సి హాల్ నుండి బుధవారం జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ వెబెక్స్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ ఏర్పాట్లపై కలెక్టర్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఇట్టి కళ్యాణ మహోత్సవమునకు విచ్చేయు వేలాది మంది భక్తులకు ఎటువంటి ఆటంకములు జరగకుండా మిషన్ భగీరథ శాఖ నిరంతరం నీటి సరఫరా చేయాలని, పోలీస్ శాఖ వారిని పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని, వైద్య ఆరోగ్య శాఖ మెడికల్ క్యాంపు , ఒక అంబులెన్స్ సిద్ధముగా ఉంచే విధముగా ఏర్పాటు చెయ్యాలని అన్నారు. ఆర్టీసీ కళ్యాణ మహోత్సవ ములకు అదనపు బస్సులు ఏర్పాటు చేయాలని తెలిపారు విద్యుత్ శాఖ సరఫరాకు ఆటంకం కలగకుండా నిరంతరం సరఫరా ఉండే విధంగా చూడాలని వెల్లడించారు. మట్టపల్లి గ్రామపంచాయతీ దేవాలయ పరిసర ప్రాంతాలు పారిశుధ్యం చేయుటకు, ఫైర్ సర్వీస్ వారిని ఫైర్ ఇంజన్ స్టాండ్ బై చేయుటకు, సాగర్ సిమెంట్ , నాగార్జున సిమెంట్ వారి సహకారంతో భక్తులకు స్నాక్స్ అందించుట, దేవస్థానం వారు క్యూలైన్స్ ఏర్పాటు , పార్కింగ్ స్థలంలో సీసీ కెమెరా ఏర్పాటు, వృద్ధులకి, దివ్యాంగులకు ఉచిత ఆటో ఏర్పాటు మొదలగునవి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సూచించారు.దేవస్థానం అనువంశిక ధర్మకర్త చెన్నూరు మట్టపల్లి రావు మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు వారి యొక్క సహాయ సహకారాలు సేవా దృక్పథంలో అందించి శ్రీ స్వామివారి తిరు కళ్యాణ మహోత్సవములు విజయవంతం చేయుటకు కోరినారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె సీతారామారావు, అడిషనల్ ఎస్పీ రవీందర్ రెడ్డి, జడ్పీ సీఈఓ డి శిరీష, ఆర్డిఓ వి.శ్రీనివాసులు , కె భాస్కర్, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ కే భాస్కర్, నల్గొండ, దేవస్థాన అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లి రావు, విజయకుమార్, దేవస్థాన కార్యనిర్వహణాధికారి బి.జ్యోతి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పేదల గడప వద్దకే సంక్షేమ ఫలాలు

మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

రూ. 6.50 కోట్లతో రోడ్డు పనులు రైతు రుణమాఫీపై కీలక వ్యాఖ్యలు

**ఖమ్మం, ఏప్రిల్ 22 పల్లె వెలుగు**




ఖమ్మం జిల్లా పర్యటనలో భాగంగా రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఖమ్మంలోని క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 27 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం పేదల గడప వద్దకే సంక్షేమ ఫలాలను నేరుగా చేరవేస్తోందని ఆశాభావం వ్యక్తం చేశారు. నిరుపేద కుటుంబాల్లో ఆడపిల్లల పెళ్లిళ్లు భారం కాకూడదన్న లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తోందని ఆయన వివరించారు. లబ్ధిదారులతో నేరుగా ముచ్చటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

# కొండను కొల్లగొడుతున్నా -ఎందుకీ మౌనం

**ఏప్రిల్ 22 పల్లె వెలుగు**



జిల్లాకేంద్రానికి సుమారు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతాన్ని అటవీశాఖ కాపాడుకోలేకపోతోంది. కళ్ల ముందే గ్రానైట్ తవ్వకాలు జరుగుతున్నా.. అడ్డుకోలేకపోతోంది. పార్వతీపురం మండలం కోరి రెవెన్యూ పరిధి సర్వే నెంబర్-1లో బడిదేవర కొండ వద్ద యథావిధిగానే గ్రానైట్ తవ్వకాలు కొనసాగుతున్నాయి. బడిదేవర కొండ వద్ద కొనసాగుతున్న గ్రానైట్ తవ్వకాలు. జిల్లాకేంద్రానికి సుమారు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతాన్ని అటవీశాఖ కాపాడుకోలేకపోతోంది. కళ్ల ముందే గ్రానైట్ తవ్వకాలు జరుగుతున్నా.. అడ్డుకోలేకపోతోంది. పార్వతీపురం మండలం కోరి రెవెన్యూ పరిధి సర్వే నెంబర్-1లో బడిదేవర కొండ వద్ద యథావిధిగానే గ్రానైట్ తవ్వకాలు కొనసాగుతున్నాయి. కోట్లాది రూపాయల గ్రానైట్‌ను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. కాగా ఆ ప్రాంతం రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో ఉందని తెలిసినప్పటికీ అటవీశాఖ తమకేమీ పట్టనట్లు ఉండడంపై విమర్శలు వెల్లువెత్తు తున్నాయి. అసలు ఇంతవరకు కోర్టు మెట్లు ఎక్కకపోవడం సర్వత్రా చర్చనీయాంశమవుతోంది.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 EDITOR; M Mahesh Babu RNI No: APTEL/2012/46499Phone No 9849499960,9059696959 Email id: Pallevelugunews9@gmail.com